News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :227 | ఖమ్మం | సోమవారం, సెప్టెంబర్ 21, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## తేజస్‌లో ప్రయాణించిన భారత్.. జపాన్ ఎయిర్‌ఫోర్స్ చీఫ్‌లు

- ఆకట్టుకున్న ఇరుదేశాల సైనిక విన్యాసాలు
- జోధ్‌పూర్‌లో భారత్- జపాన్ సైనిక విన్యాసాలు
- ఈ విన్యాసాలలో భారత్ తరఫున పాల్గొన్న తేజస్, సుకోయ్-30ఎంకేఐ, రఫేల్.. జపాన్ నుంచి పాల్గొన్న ఎఫ్-2ఏ ఫైటర్ జెట్

2



## కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం దుష్ప్రచారం చేస్తున్నారు

- దళితుల భూముల్లో అంగుళం కూడా తీసుకోం..
- ఆయన మాటలు నమ్మొద్దు
- కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణ నేపథ్యంలో దళిత రైతులకు నోటీసులు
- దళితుల భూములపై మంత్రి పొంగులేటి భరోసా
- భూ రికార్డుల పరిశీలన హక్కుల పరిరక్షణకేనని, భూసేకరణ కాదని వివరణ
- దళితులు, గిరిజనుల భూ హక్కులకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ



హైదరాబాద్

రాష్ట్రంలోని దళితుల భూముల్లో అంగుళం కూడా ప్రభుత్వం తీసుకోదని, వారి భూములకు పూర్తి భద్రత కల్పిస్తామని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం స్పష్టం చేశారు. దళితులు, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజల ప్రభుత్వ విధానం కాదని ఆయన తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం దళితుల భూములకు పూర్తి రక్షణ కవచంగా వివరాలు 2లో..



## విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన బీజేపీ, ఆర్ఎస్ఎస్

- విద్యార్థులకు అండగా రాహుల్: కాంగ్రెస్
- విద్యార్థులను అణచివేస్తున్న వ్యవస్థ వెనుక ఉన్నది బీజేపీ ఆర్ఎస్ఎస్ వాళ్లేనని కాంగ్రెస్ ఆరోపణ
- విద్యా వ్యవస్థను గుల్లగా మార్చి, అవినీతిమయం చేశారని విమర్శ

2



## ఓట్ల తొలగింపు వెనుక అమిత్ షా ఉన్నారు

ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు

# అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు



- ఇందిరమ్మ ఫ్లాట్ లబ్ధిదారులకు గుడ్‌న్యూస్
- నేటి నుంచే అలాట్‌మెంట్ లెటర్స్
- హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికైన లబ్ధిదారులకు నేటి నుంచి హౌజింగ్‌బోర్డు అలాట్‌మెంట్ లెటర్స్ జారీ చేయనుంది
- ఈ మేరకు లబ్ధిదారుల మొబైళ్లకు నేరుగా పత్రాలను పంపనుంది
- అధికారిక వెబ్‌సైట్ నుంచీ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రకటించింది

హైదరాబాద్

ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు శుభవార్త చెప్పింది. ఎంపికైన దరఖాస్తుదారులకు సోమవారం నుంచి అలాట్‌మెంట్ లెటర్లు జారీ చేయనున్నట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు (టీజీహెచ్‌బీ) ప్రకటించింది. లబ్ధిదారుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు నేరుగా వాట్సాప్, ఎస్సెమ్మెస్ ద్వారా ఈ పత్రాలను పంపనున్నారు. అలాగే టీజీహెచ్‌బీ అధికారిక వెబ్‌సైట్ నుంచి కూడా వీటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. మరోవైపు శేరిలింగంపల్లి నియోజకవర్గం రాయదుర్గంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణానికి గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. మల్కం చెరువు వెనుక భాగంలో సుమారు రూ.750 కోట్లకుపైగా విలువైన 2.85 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఈ ప్రాజెక్టును వివరాలు 2లో..

## యూపీలోని వీధుల్లో నడిచే మహిళను వేధించే సాహసం ఎవరూ చేయరు

- వీధిలో నడిచే ఆడపిల్లను వేధించే సాహసం ఎవరైనా చేస్తారా? అలా చేస్తే మరణ శాసనం రాసుకున్నట్లే
- యూపీలో మహిళల భద్రతపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కీలక వ్యాఖ్యలు
- తన హయాంలో మతపరమైన అశాంతి పూర్తిగా తొలగిపోయింది

2



## నేను వాళ్లూ, వీళ్లూ వదిలిన బాణాన్ని కాదు



- కొడంగల్‌లో పాంచజన్య సంకల్ప సభ
- కొడంగల్ గడ్డపై నుంచి చెబుతున్నా.. నేను ఎవరి బాణాన్ని కాదు అంటూ కవిత వ్యాఖ్యలు
- అధికారానికి దూరంగా ఉన్న బహుజనుల బాణాన్ని నేనని వ్యాఖ్య
- యువత, బహుజనుల కోసం ఎవరితోనైనా పోరాడుతానని ప్రకటన
- అక్షరాస్యత విషయంలో సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించిన కవిత

2



## మనవాళ్లు చైనాకు పట్టుబడ్డప్పుడు నా పనైపోయిందనుకున్నా

- యువ ఐపీఎస్ అధికారిగా ఉన్నప్పటి ఘటనను గుర్తుచేసుకున్న డోభాల్
- ఆయన పంపిన నిఘా బృందాన్ని చైనా సైన్యం అదుపులోకి తీసుకుంది
- ఈ ఘటనతో తన కెరీర్ ముగిసిపోయిందని భావించినట్లు వెల్లడి
- హెడ్ క్వార్టర్స్ ఇచ్చిన తప్పుడు మ్యాపుల వల్లే సమస్య తలెత్తిందని విచారణలో తేలింది
- ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవంలో పాత జ్ఞాపకాలను పంచుకున్న డోభాల్

# '120' స్పీడ్‌తో గాల్లో కలుస్తున్న ప్రాణాలు

- ఓఆర్ఆర్ ఎక్కితే దిగుతామన్న గ్యారెంటీ లేదు!
- అజాగ్రత్త, అతివేగం కారణంగా ఈ ఏడాది 9 నెలల వ్యవధిలోనే ఓఆర్ఆర్‌పై 28 ప్రమాదాలు
- ఈ ఘటనల్లో 20 మంది ప్రాణాలు కోల్పోయారు
- ఓఆర్ఆర్‌పై భద్రతా చర్యలు తీసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



హైదరాబాద్

అజాగ్రత్త, అతి వేగం, నిర్లక్ష్యం ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పై వరస ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మేడ్చల్, శామీర్‌పేట, కీసర, ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ల పరిధుల్లో ఓఆర్ఆర్ 35 కిలోమీటర్లు విస్తరించి ఉంది. వీటిలో ముఖ్యంగా 9, 7, 6 ఎగ్జిట్ల పరిధిలో ఓఆర్ఆర్‌పైకి వచ్చే వాహనాలు ఎప్పటికప్పుడు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రోడ్డెక్కితే తిరిగొస్తామో లేదో అనే భయం వాహనదారుల్లో నెలకొంది. ఈ సంవత్సరం ప్రారంభమయినప్పటి నుంచి నేటి వరకు 9 నెలల వ్యవధిలో ఓఆర్ఆర్‌పై 28 ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనల్లో 20 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల సంఘటనలను పరిశీలిస్తే మరమ్మతులకు గురైన వాహనాలు రహదారి పక్కన వివరాలు 2లో..

# కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం దుష్ప్రచారం చేస్తున్నారు

-మొదటిపేజీ తరువాయి

నిలుస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల ఆశీస్సులతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని పొంగులేటి పేర్కొన్నారు. సామాజిక న్యాయం, పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వాల ప్రధాన ప్రాధాన్యతలని అన్నారు. భూసంస్కరణలు, భూ పంపిణీ వంటి చారిత్రక నిర్ణయాలతో నిరుపేద దళితులకు భూములు ఇచ్చి హక్కులు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో సుమారు 25 లక్షల ఎకరాల భూమిని దళితులకు, 2 లక్షల ఎకరాల పోడు భూములను గిరిజనులకు పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పి మోసం చేసిన 'దొర' కేసీఆర్ మాటలను నమ్మవద్దని ఆయన ప్రజలను కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై విచారణ జరుపుతామని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో ఈ వివాదం



మొదలైంది. ఈ ఫామ్‌హౌస్ దాదాపు 700 ఎకరాల్లో విస్తరించి ఉందని, అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఈ క్రమంలోనే ఎర్రవల్లి గ్రామానికి చెందిన 120 మంది దళిత రైతులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. భూ యాజమాన్య హక్కులకు సంబంధించిన పత్రాలతో హాజరుకావాలని ఆ నోటీసుల్లో పేర్కొనడంతో దళితుల్లో ఆందోళన మొదలైంది.

ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. "ప్రభుత్వం మీ భూమిలో అంగుళం కూడా తీసుకోదు. మీ భూములను స్వాధీనం చేసుకునే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి లేదు. మీ భూముల విషయంలో ఎలాంటి భయం, ఆందోళన అవసరం లేదు. ప్రజల ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది" అని దళితులకు భరోసా ఇచ్చారు. భూ రికార్డుల పరిశీలన, సర్వే, భూ సమస్యల పరిష్కారం వంటి ప్రక్రియలను భూములు లాక్కోవడంగా చూడటం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రజల భూ హక్కులను స్పష్టంగా నమోదు చేయడం, వివాదాలను పరిష్కరించడం, వారి హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.

కొంతమంది శక్తిమంతమైన వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళితులను రెచ్చగొట్టేందుకు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నారని మంత్రి ఆరోపించారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఇలాంటి ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్య చట్టబద్ధంగా, పారదర్శకంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# ఉపాధి కల్పనలో 'కోదాడ మెగా జాబ్ మేళా' మైలురాయి

హైదరాబాద్: విద్యావంతులైన గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను చేరువ చేయాలన్న లక్ష్యంతో నిర్వహించిన కోదాడ మెగా జాబ్ మేళా విజయవంతమైంది. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో సుమారు 350 కంపెనీలు ఒకే వేదికపైకి రాగా, 30 వేల మందికిపైగా ఉద్యోగార్థులు నమోదు చేసుకున్నారు. వివిధ దశల్లో నిర్వహించిన ఇంటర్వ్యూల అనంతరం 5,725 మంది అభ్యర్థులు తదుపరి నియామక ప్రక్రియకు షార్ట్‌లిస్ట్ అయ్యారు.

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి నేతృత్వంలో సెప్టెంబర్ 19న నిర్వహించిన ఈ భారీ నియామక కార్యక్రమం గ్రామీణ నిరుద్యోగ సమస్యను ప్రధానాంశంగా తీసుకుంది. భౌగోళిక దూరం, ఉద్యోగ సమాచార లోపం, ఆర్థిక పరిమితుల కారణంగా ప్రముఖ సంస్థలను చేరుకోలేకపోతున్న గ్రామీణ యువతకు స్థానికంగానే అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఈ మేళాను నిర్వహించారు. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన యువత ఈ మేళాలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమాచార సాంకేతికత, ఫార్మా, తయారీ, వైద్య ఆరోగ్య రంగం, బ్యాంకింగ్, రిటైల్‌తోపాటు వివిధ రంగాలకు చెందిన సంస్థలు అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాలను పరిశీలించి ప్రత్యక్ష ఇంటర్వ్యూలు నిర్వహించాయి. గ్రామీణ కుటుంబాలు ఎన్నో త్యాగాలు చేసి తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నప్పటికీ, వారికి సరైన సమయంలో ఉద్యోగ సమాచారం అందడం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, పాలిటెక్నిక్ తదితర కోర్సులు పూర్తి చేసిన యువత ఉద్యోగ అవకాశాలను గుర్తించడం, సంస్థలను సంప్రదించడం, ఇంటర్వ్యూల కోసం పదేపదే నగరాలకు వెళ్లడం వంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వివరించారు. ఒక యువకుడి గ్రామ చిరునామా లేదా కుటుంబ ఆర్థిక పరిస్థితి అతని ఉద్యోగ అవకాశాలకు అడ్డంకిగా మారకూడదన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.



అర్హులైన ఉద్యోగుల కోసం ఎదురుచూస్తున్న కంపెనీలు, తొలి అవకాశం కోసం నిరీక్షిస్తున్న గ్రామీణ యువతను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా వారి మధ్య ఉన్న అంతరాన్ని ఈ మేళా తగ్గించిందన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలు, నైపుణ్యాలను నేరుగా సంస్థల ప్రతినిధుల ముందు ప్రదర్శించడంతోపాటు సంఘటిత రంగంలో ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన అర్హతలు, నైపుణ్యాలపై అవగాహన పొందారని తెలిపారు.

గత ఏడాది హుజూర్‌నగర్‌లో నిర్వహించిన జాబ్ మేళా అనుభవానికి కొనసాగింపుగా కోదాడలో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృత స్థాయిలో చేపట్టారు. పారిశ్రామికవేత్తలు, విద్యాసంస్థలు, ఐదు జిల్లాల అధికార యంత్రాంగంతో ముందస్తుగా సమన్వయం చేసుకుని యువతను పెద్ద ఎత్తున సమీకరించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఈ కార్యక్రమానికి సహకారం అందించాయి.

జాబ్ మేళాలో పాల్గొన్న యువతను ఉద్దేశించి శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలను చేరువ చేయడంలో కోదాడ మెగా జాబ్ మేళా రాష్ట్రంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ప్రశంసించారు. ఒకే వేదికపైకి సుమారు 350 కంపెనీలను తీసుకురావడం అసాధారణమైన ప్రయత్నమన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి భారీ ఉద్యోగ మేళాలను నిర్వహించి యువత నివసిస్తున్న ప్రాంతాలకు చేరువలోనే ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఐటీ--పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రోడ్లు--భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తదితరులు జాబ్ మేళాలో పాల్గొన్నారు. కంపెనీల ప్రతినిధులు, ఉద్యోగార్థులతో వారు మాట్లాడి, ఉద్యోగ అవకాశాలు పొందిన అభ్యర్థులను అభినందించారు.

# ఖైరతాబాద్, బాలాపూర్ వద్ద భారీ రద్దీ గణనాథుల దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఖైరతాబాద్ బడా గణేశ్ దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో మహాగణపతిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఈ ఒక్కరోజే లక్షమందికిపైగా భక్తులు దర్శించుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బడా గణేశ్ దర్శనానికి 2 కిలోమీటర్ల మేర భక్తులు క్యూ కట్టారు. వృద్ధులు, చిన్నారులు మహాగణపతి దర్శనానికి రావద్దని ఉత్సవ నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు. దర్శనానికి నాలుగు గంటల సమయం పడుతోంది. భక్తులు అసౌకర్యానికి గురికాకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### ఖైరతాబాద్ గణేశుడుని దర్శించుకున్న మంత్రి పొన్నం

మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రోజురోజుకూ భక్తుల సంఖ్య పెరుగుతోందని మంత్రి తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా భక్తుల రద్దీకి తగ్గట్లు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు పొన్నం వెల్లడించారు. భగవంతుడి కృపతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరినట్లు తెలిపారు. తెలంగాణలో వర్షాలు కురవాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఇక్కడికి వచ్చే భక్తులు కోరుకోవాలని పొన్నం విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్‌లో ఖైరతాబాద్ గణేశుడు తర్వాత అంతటి ప్రసిద్ధి బాలాపూర్ గణపయ్యకే దక్కుతుంది. అత్యంత ప్రసిద్ధి చెందిన బాలాపూర్ గణేశ్ మండపానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఈ ఏడాది ఇక్కడ పూరీ జగన్నాథుడి ఆలయం నమూనాలో 18 అడుగుల వినాయకుడు భక్తులకు దర్శనమిస్తున్నాడు. 18 అడుగుల గణనాథుడి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. గతంలో



బాలాపూర్?లో తిరుపతి, అరుణాచలం, అయోధ్య రామమందిరం తదితర ఆలయాల నమూనాల్లో గణేశుడు కొలువు దీరిన విషయం తెలిసిందే. రోజూ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు భక్తుల దర్శనాలకు అనుమతినిస్తుండటంతో, స్వామివారిని దర్శించుకోవడానికి, ప్రత్యేక పూజల్లో పాల్గొనడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి క్యూలైన్లలో వేచి ఉంటున్నారు. ఈ రోజు ఆదివారం కావడంతో బాలాపూర్ స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులు అసౌకర్యానికి గురికాకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

## నేను వాళ్లూ, వీళ్లూ వదిలిన బాణాన్ని కాదు

తాను వాళ్లూ వీళ్లూ వదిలిన బాణాన్ని కాదని, దశాబ్దాలుగా అధికారానికి, విద్యకు దూరంగా ఉన్న బహుజనుల బాణాన్ని అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. యువత, బహుజనుల హక్కుల కోసం ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌తో అయినా కొట్లాడటానికి సిద్ధమని ఆమె ప్రకటించారు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఆదివారం నిర్వహించిన 'పాంచజన్య సంకల్ప సభ'లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు ముందు కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా వేదిక వద్దకు చేరుకున్న కవిత, తన రాజకీయ వైఖరిని వివరిస్తూ ప్రత్యర్థులపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "నన్ను కాంగ్రెస్ వదిలిన బాణమని బీఆర్ఎస్ వాళ్లు, కేసీఆర్ వదిలిన బాణమని రేవంత్‌రెడ్డి అంటున్నారు. మరికొందరు తలకాయ లేనివాళ్లు బీజేపీ బాణమని మాట్లాడుతున్నారు. కొడంగల్ గడ్డపై నుంచి నేను ఒక్కటే చెబుతున్నా. నేను తెలంగాణ బహుజనుల బాణాన్ని. యువజనుల యుద్ధ నినాదాన్ని. అంబేడ్కర్ వాదాన్ని, మహాత్మ జ్యోతిబా ఫులే ఆత్మగౌరవ నినాదాన్ని నేను" అని కవిత ఉద్ఘాటించారు. ఒక మహిళ ఎవరి మద్దతు లేకుండా రాజకీయంగా నిలబడగలదని నిరూపించేందుకే ఇక్కడికి వచ్చానని, ప్రజలు తనకు ధైర్యం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కవిత విమర్శలు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గట్టు, కేటీ దొడ్డి మండలాల్లో అక్షరాస్యత రేటు అఫ్గానిస్తాన్‌తో సమానంగా ఉందని, గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన రేవంత్ రెడ్డి అప్పుడు ఏం చేశారని నిలదీశారు. దేశంలో మహిళలను మహారాణులుగా కీర్తిస్తారని, కానీ వంటింట్లోని గిన్నెల మీద కూడా మగవాళ్ల పేర్లే ఉంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. 29 రాష్ట్రాలున్న దేశంలో కేవలం ఒక్క రాష్ట్రానికి మాత్రమే మహిళ ముఖ్యమంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. బహుజనులు, మహిళలు, యువత రాజకీయంగా ఎదిగేందుకు తన పోరాటం కొనసాగుతుందని కవిత తెలిపారు.

## '120' స్పీడ్‌తో గాల్లో కలుస్తున్న ప్రాణాలు

-మొదటిపేజీ తరువాయి

నిలపడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వెనక నుంచి వేగంగా వస్తున్న వాహనాలు నిలిచి ఉన్న వాహనాలను ఢీ కొనడంతోనే అనేక మంది మరణిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇంకో వైపు డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో నిద్ర మత్తులోకి జారుకోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా ఓఆర్ఆర్‌పై వేగాన్ని 120 కి.మీలకు పెంచడంతో అంతే వేగంగా ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ముఖ్యంగా వాహనాలను రహదారి పక్కన నిలిపే విషయంలో భద్రతా చర్యలు తీసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### వాహనాలను వేగంగా నడపటంతో ప్రమాదాలు

ఓఆర్ఆర్‌పై కొన్నిసార్లు వేగంగా నడుపుతున్న లారీలను అకస్మాత్తుగా నిలపడం వల్ల కూడా అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మరోవైపు గచ్చిబౌలి నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి ఓఆర్ఆర్‌లో వెళ్తున్న కొందరు, వేగంగా కార్లను, వాహనాలను నడపడంతో ప్రమాదాలకు కారణమవుతున్నారు. కొన్నిచోట్ల సర్వీస్ రోడ్డు నుంచి ఔటర్ రింగ్ రోడ్డులోకి వచ్చేటప్పుడు వాహదారులు సిగ్నల్ వ్యవస్థను ఉపయోగించకుండా దూసుకురావడంతో చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఔటర్ ప్రాంతంలో చెట్ల నరికివేత సమయంలో సంబంధిత హెచ్చరిక వ్యవస్థలను కూడా వినియోగించడం లేనట్లు వాహనదారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే హైవే సిబ్బంది రోడ్డు పక్కన వాహనాలను నిలిపి ఉంచడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది.

### ఎక్కువ ప్రమాదాలు అక్కడే

ఈ సంవత్సరం మార్చి నెలలో మేడ్చల్ జిల్లా శామీర్‌పేట ఓఆర్ఆర్ ఎగ్జిట్-7 దగ్గర కొందరు రోడ్డు పక్కన తమ వాహనాలను నిలిపి భోజనం చేస్తున్నారు. అయితే వెనక నుంచి వచ్చిన కంటైనర్? లారీ వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఈ మార్గంలోని ట్రామా కేర్ సెంటర్ల పరిధిలోనే నిత్యం ప్రమాదాలు జరుగుతాయని అక్కడి సిబ్బంది, స్థానికులు చెబుతున్నారు.

### ప్రమాదకర మలుపులు ఉండటంతో

శంషాబాద్ కాల్ సెంటర్‌కు సమాచారం అందిన పది నిమిషాల్లోనే ఘటనా స్థలానికి చేరుకొని సేవలందిస్తామని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. ఒక్కో షిఫ్టులో ఇద్దరు ఎమర్జెన్సీ పారామెడికల్ సిబ్బంది, ఒక హెల్పర్, డ్రైవర్ పని చేస్తున్నారు. ఈ రహదారిపై ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాల్లో ప్రమాదకర మలుపులు ఉన్నాయి. దీంతో భారీ వాహనాలు, ట్రక్కులు బోల్తా పడుతున్న ఘటనలు నమోదవుతున్నాయి. మేడ్చల్ ఎగ్జిట్ గేట్ వద్ద ఈ పరిస్థితిని గమనించిన అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో ఇక్కడి ప్రమాదాలు కాస్త తగ్గుముఖం పట్టాయి. మిగతా ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తే బాగుంటుందని వాహనదారులు కోరుతున్నారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు



-మొదటిపేజీ తరువాయి

చేపట్టనున్నారు. ఇక్కడ మొత్తం 480 ఫ్లాట్లను నిర్మించనున్నారు. నాలెడ్జ్ సిటీ లాంటి ప్రధాన ప్రాంతంలో మార్కెట్లో దాదాపు రూ.50 లక్షలు విలువ చేసే ఒక్కో ఫ్లాట్‌ను కేవలం రూ.6 లక్షలకే ప్రభుత్వం అందించనుంది. భూమి ఖర్చును పూర్తిగా భరిస్తున్న సర్కార్, ఒక్కో ఫ్లాట్‌కు రూ.5 లక్షల చొప్పున సబ్సిడీని అందిస్తోంది. కాగా రేపు మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి లబ్ధిదారులు కుటుంబ సమేతంగా హాజరుకావాలని హౌసింగ్ బోర్డు అధికారులు విజ్ఞప్తి చేశారు.

### డబుల్ బెడ్‌రూం ఇళ్లపైనా కీలక ఆదేశాలు

హైదరాబాద్ క్యూర్ పరిధిలోని అసంపూర్తిగా ఉన్న 26 ప్రాంతాల్లో 21 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ నెల చివరి నాటికి ఈ ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శనివారం హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, గృహనిర్మాణ, జలమండలి, విద్యుత్ శాఖల అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా నిర్వహించారు.

### వారికే ఇళ్లు కేటాయించాలి

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపికను ఈ నెల 30వ తేదీలోపు అత్యవసర ప్రాతిపదికన లక్కీ డ్రా ద్వారా చేపట్టాలని మంత్రి పొంగులేటి అధికారులకు సూచించారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాలకు 5 నుంచి 7 కిలోమీటర్ల పరిధిలో నివసిస్తున్న వారిని మాత్రమే ఎంపిక చేయాలని సూచించారు. ఈ ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుధ్య సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జలమండలి, గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్), విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అక్టోబర్ చివరి నాటికి మౌలిక సదుపాయాల ఏర్పాటు పూర్తి కావాలని ఆదేశించారు. "డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అనర్హులు ఉంటే అధికారులు వెంటనే వారిని తొలగించాలి. కేటాయించిన ఇళ్లలో నివసించని వారికి తుది నోటీసులు జారీ చేయాలి. స్పందించని వారి కేటాయింపులను రద్దు చేసి, ఆ యూనిట్లను అర్హులైన వారికి తిరిగి కేటాయించాలి. క్యూర్ పరిధిలో ఇప్పటికే ఇంటి స్థలాలు ఉన్న సుమారు 9 వేల మంది అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాము. ఇన్‌ఛార్జ్ మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో లబ్ధిదారులను ఎంపిక చేసి, వారికి మంజూరు పత్రాలను అందజేయాలి"

# అక్టోబర్ 2 న మద్యపాన నిషేధం కోరుతూ కలెక్టరేట్ ముట్టడి,

- అక్టోబర్ 7న జరుగు ఎమ్మార్పీఎస్ , ఎంఎస్పి నూతన మండలాల జాతీయ సదస్సు ను విజయవంతం చేయండి.
- ధర్మసాగర్ మండల సమావేశం నిర్వహణ , అక్టోబర్ 2న కలెక్టరేట్ ముట్టడి, అక్టోబర్ 7న జాతీయ సదస్సు విజయవంతానికి పిలుపు ఏపూరి వెంకటేశ్వర్లు మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జ్, తడుగుల విజయ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా కో ఇంచార్జి



**సీకే న్యూస్ సెప్టెంబర్ 20 ఆదివారం హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్.**
పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈరోజు ధర్మసాగర్ మండలంలో హనుమకొండ గంగారపు శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ, కో-ఇంచార్జి తడుగుల విజయ్ మాదిగ, గంగారపు శ్రీనివాస్ మాదిగ గార్లు పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అక్టోబర్ 2వ తేదీన మద్యపాన నిషేధం కోరుతూ హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా, అక్టోబర్ 7 వ తేదీన ఆంధ్రప్రదేశ్ అమరావతి లో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ ,ఎంఎస్పి మండల కమిటీల జాతీయ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. మద్యపాన నిషేధం కోసం నిర్వహించే హనుమకొండ జిల్లా కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నా కార్యక్రమానికి ధర్మసాగర్ మండలం లోని ప్రతి గ్రామం నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వక్కల అక్షిత్ మాదిగ ఎమ్మార్పీఎస్ ధర్మసాగర్ మండల అధికార ప్రతినిధి పొడిశెట్టి ప్రతాప్ మాదిగ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు,
పోడిశెట్టి సురేందర్ మాదిగ ఎంఎస్పి సీనియర్ నాయకులు, నమిండ్ల ప్రభుదాస్ మాదిగ ఎమ్మార్పీఎస్ ధర్మసాగర్ మండల ప్రధాన కార్యదర్శి, తాటికాయల అశోక్ మాదిగ ఎమ్మార్పీఎస్ ధర్మసాగర్ మండల ప్రధాన కార్యదర్శి, కనకం అనిల్ మాదిగ ఎమ్మార్పీఎస్ ధర్మసాగర్ మండల ప్రధాన కార్యదర్శి, సింగారపు దిలీప్ మాదిగ ఎమ్మార్పీఎస్ ధర్మసాగర్ మండల ఉపాధ్యక్షులు, నక్క ప్రవీణ్ మాదిగ ఎమ్మార్పీఎస్ ధర్మసాగర్ మండల కోశాధికారి, వక్కల రూషన్ మాదిగ ఎమ్మార్పీఎస్ ధర్మసాగర్ మండల కార్యదర్శి, తాటికాయల శంకర్ మాదిగ ఎమ్మార్పీఎస్ ధర్మసాగర్ మండల కార్యదర్శి, సోంపల్లి రాజేందర్ మాదిగ ఎమ్మార్పీఎస్ సాయిపేట గ్రామ అధ్యక్షులు, సోంపల్లి ప్రవేశ్ మాదిగ ఎమ్మార్పీఎస్ సాయిపేట గ్రామ ఉపాధ్యక్షులు, ఇమ్మడి ప్రమోద్ మాదిగ ఎమ్మార్పీఎస్ సాయిపేట గ్రామ కోశాధికారి, సోంపల్లి ప్రవీణ్ మాదిగ ఎంఎస్పి సాయిపేట గ్రామ అధ్యక్షులు, గంగారపు కుమారస్వామి మాదిగ ఎంఎస్పి సాయిపేట గ్రామ అధికార ప్రతినిధి, సోంపల్లి సోక్కయ్య మాదిగ ఎంఎస్పి సాయిపేట గ్రామ కోశాధికారి, సోంపల్లి సంపత్ మాదిగ ఎంఎస్పి సాయిపేట గ్రామ సహాయ కార్యదర్శి, చిలక రాకేష్ మాదిగ, రవి మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు గుర్రై మూగజీవాలు మృతి



**సికె.న్యూస్. అదిలాబాద్:**ఆదిలాబాద్ రూరల్ కురిసిన వర్షానికి మండలంలోని లోహరా గ్రామ పంచాయతీ పరిధిలో విషాదం చోటుచేసుకుంది. రైతు గైక్వాడ్ సునీల్‌కు చెందిన రెండు ఎద్దులు, ఒక ఆవుపై పిడుగు పడటంతో అక్కడికక్కడే చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ప్రమాదంలో మూడు మూగజీవాలు అక్కడికక్కడే మృతి చెందటంతో రైతుకు తీవ్ర నష్టం వాటిల్లిందని స్థానికులు తెలిపారు. రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కారులో చిక్కుకుని సర్పంచ్ కుమార్తె మృతి

- ఐదేళ్ల చిన్నారి మృతితో.. వినోభానగర్‌లో విషాదం
- ఊరంతా గాలించినా దొరకని చిన్నారి.. చివరకు ఇంటి ముందు కారులో మృతదేహం



**సీకే న్యూస్ జూలూరుపాడు సెప్టెంబర్ 20 2026:** జూలూరుపాడు మండలం వినోభానగర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామ సర్పంచ్ గంగావత్ నవీన్ కుమార్తె తన్విత (5) ప్రమాదవశాత్తు కారులో చిక్కుకుని మృతి చెందినట్లు సమాచారం. ఆడుకుంటూ వెళ్లిన చిన్నారి ప్రమాదవశాత్తు ఇంటి ముందు నిలిపి ఉన్న కారులోకి వెళ్లినట్లు తెలుస్తోంది. అనంతరం కారు తలుపులు లాక్ కావడంతో బయటకు రాలేకపోయినట్లు సమాచారం.
చిన్నారి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు గురయ్యారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో చిన్నారి కోసం విస్తృతంగా గాలించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో ఇంటి ముందు నిలిపి ఉన్న కారును పరిశీలించగా, అందులో చిన్నారి ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. కారు అద్దాలు, తలుపులు మూసి ఉండటంతో లోపల ఊపిరాడక మృతి చెంది ఉండవచ్చని అనుమానిస్తున్నారు. అయితే చిన్నారి మృతికి ఖచ్చితమైన కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఊరంతా వెతికిన అనంతరం ఇంటి ముందే నిలిపి ఉన్న కారులో చిన్నారి మృతదేహం లభించడం కుటుంబ సభ్యులను, గ్రామస్థులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. చిన్నారి మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటగా, వినోభానగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## గూడూరులో లడ్డూ వేలం కైవసం చేసుకున్న గుండు విఠలయ్య



**షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు సీ కే న్యూస్ సెప్టెంబర్ 20:**షాద్‌నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం పరిధిలోని గూడూరు గ్రామపంచాయతీ పరిధిలో కోట మైసమ్మ ఆలయ సమీపంలోని భజన మండలి ఆధ్వర్యంలోని వినాయక మండపంలో ఆదివారం లడ్డూ వేలం పాట ఘనంగా నిర్వహించారు. ఈ వేలం పాటలో భక్తులు పోటీపడి పాల్గొనగా, గుండు విఠలయ్య అండాలుకుమారుడు రాజు ముదిరాజ్ స్వాతిక రూ. 33,000/- లకు లడ్డూనుకైవసంచేసుకున్నారు. అనంతరం మండపం ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం కోట మైసమ్మ దగ్గర ఉన్న గణనాథునికి నవరాత్రుల్లో ప్రత్యేకంగాపూజలుచేసిఘనంగానిర్వహిస్తామన్నారు.
గ్రామాలలో వర్షాలు బాగా పడి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రామంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు పెండ్లి మడుగు రాజు గౌడ్ తెలిపారు. లడ్డూను కైవసం చేసుకున్న రాజును సాత్విక భజన మండలి సభ్యులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించి అభినందించారు. లడ్డూ వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని ఆలయ అభివృద్ధి పనులకు వినియోగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

## కాంచనపల్లి గణేష్ మండపం వద్ద అన్నదానం










**సీకే న్యూస్, వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు, సెప్టెంబర్ 20:** వలిగొండ మండలం కాంచనపల్లి సెంటర్‌లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.
అన్నదాత జక్క సుధాకర్ రెడ్డి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ సందర్భంగా వలిగొండ పీఏసీఎస్ వైస్ చైర్మన్ జక్క జంగారెడ్డి మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మహా గొప్పదని అన్నారు.
వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు.
ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని జక్క జంగారెడ్డి సూచించారు. విఘ్నేశ్వర స్వామివారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అన్నదాన కార్యక్రమానికి భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తిని సహదేవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు దేగల పాండు యాదవ్ పాల్గొన్నారు. కొమురెల్లి బాలకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ గంగారపు రమేష్, గ్రంథాలయ చైర్మన్ ఆదిమూలం రమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాపోలు సుదర్శన్, కాసుల వెంకన్న తదితరులు హాజరయ్యారు. సీనియర్ పాత్రికేయులు పడమటి దామోదర్ రెడ్డి, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బొల్లెపాక రాజేష్





**సికే న్యూస్ సెప్టెంబర్ 20 ఆదివారం హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్.**తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండలంలోని తాటికాయల గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక సంపాదకులు బొల్లెపాక రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఫోరమ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బూర్గుల నాగేందర్ తెలిపారు.
ఆదివారం హైదరాబాద్‌లోని బీసీసీఈ భవన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సులో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బొల్లెపాక రాజేష్ మాట్లాడుతూ తెలంగాణలోని మాదిగ జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. జర్నలిస్టుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఫోరమ్‌ను బలోపేతం చేస్తానని తెలిపారు.
యువ జర్నలిస్టులకు మార్గదర్శకత్వం, వృత్తిపరమైన శిక్షణ అందించడంతో పాటు, మహిళా జర్నలిస్టుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఫోరమ్‌ను వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా మాదిగ జర్నలిస్టుల సమష్టి ప్రయోజనాల కోసం పనిచేసే బలమైన వేదికగా తీర్చిదిద్దేందుకు నూతన కార్యవర్గంతో కలిసి పనిచేస్తానని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల మధ్య ఐక్యతను పెంపొందించి, కష్టకాలంలో సభ్యులకు అండగా నిలిచే విధంగా ఫోరమ్‌ను ముందుకు తీసుకెళ్తామని రాజేష్ తెలిపారు.

## గ్రామస్తులంతా అప్రమత్తంగా ఉండాలి




**సికె.న్యూస్. బజారత్నూర్:**గత వారం రోజులుగా బజార్ హత్నూర్ గ్రామంలో కుండేంగ సంచరిస్తూ ప్రజలపై దాడులకు పాల్పడుతున్న నేపథ్యంలో, గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు అత్యవసర పరిస్థితి తప్ప ఇంటి నుంచి బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కొండెన్గా ను పట్టుకునేందుకు ఈరోజు వరంగల్ నుంచి ప్రత్యేక రెస్క్యూ బృందం గ్రామానికి చేరుకుంది. ప్రస్తుతం కుండేంగను పట్టుకునే చర్యలు కొనసాగుతున్నాయి. కావున కొండెన్గా ను పట్టుకునే సమయంలో గ్రామ ప్రజలు గుంపులుగా చేరకుండా, రెస్క్యూ బృందానికి సహకరించాలి. ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు ఎదురుకాకుండా అధికారులు సూచించే జాగ్రత్తలను ప్రతి ఒక్కరూ పాటించాలి. గ్రామ ప్రజల భద్రత దృష్ట్యా అందరూ అప్రమత్తంగా ఉండి, రెస్క్యూ బృందానికి సహకరించగలరు.

## రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రీ మృతి

- రోడ్డుకు అడ్డంగా నిలిపిన ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ద్విచక్రవాహనం
- రోడ్డు ప్రమాదంలో దుగ్గాపూర్ గ్రామ తాపీ మేస్త్రీ రుక్కయ్య(38) మృతి
- ట్రాక్టర్ యజమాని/డ్రైవర్‌పై కేసు
- పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్



**సికే న్యూస్ పెద్దేముల్ ప్రతినిధి, సెప్టెంబర్ 20:**రోడ్డు ప్రమాదంలో ఓ తాపీ మేస్త్రీ మృతి చెంది,ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మన్నాన్ పల్లి గ్రామ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. రోడ్డు మీద ఎలాంటి లైట్లు, ముందస్తు హెచ్చరికలు లేకుండా ట్రాక్టర్‌ను అడ్డంగా నిలిపి ఉంచడమే ప్రమాదానికి కారణమైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం......వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం దుగ్గాపూర్ గ్రామానికి చెందిన వడ్డె రుక్కయ్య (38) తాపీ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబంతో కలిసి ధారూర్‌లో నివాసం ఉంటున్నారు. ఆయన బంధువైన వడ్డె అంజమ్మ అనారోగ్యంతో బాధపడుతుండటంతో నాటు వైద్యం చేయించేందుకు రుక్కయ్య,ఆయన భార్య వడ్డె భీమమ్మ, అంజమ్మ కలిసి శనివారం ధారూర్ నుంచి దుగ్గాపూర్‌కు మోటార్‌సైకిల్‌పై వెళ్లారు. వైద్యం చేయించుకుని తిరిగి రాత్రి సుమారు 7.30 గంటల సమయంలో ధారూర్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో మన్నాన్ పల్లి గ్రామ శివారులోని బ్రిడ్జి వద్ద గణేష్ నిమజ్జనం పనుల నిమిత్తం నంబర్ ప్లేట్ లేని ఓ ట్రాక్టర్‌ను ఎలాంటి లైట్లు, హెచ్చరిక సూచనలు లేకుండా రోడ్డుకు అడ్డంగా నిలిపి ఉంచినట్లు పోలీసులు తెలిపారు. చీకట్లో ట్రాక్టర్ కనిపించకపోవడంతో ద్విచక్రవాహనం దానిని ఢీకొట్టింది. ప్రమాదంలో రుక్కయ్య నుదురు, పొట్ట భాగంలో తీవ్ర గాయాలు కావడంతో అధిక రక్తస్రావం జరిగింది. భీమమ్మ, అంజమ్మలకు కూడా గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను అంబులెన్స్‌లో తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా,రుక్కయ్య అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య భీమమ్మ పెద్దేముల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. రోడ్డుపై ట్రాక్టర్‌ను నిర్లక్ష్యంగా నిలిపిన యజమాని/డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ తెలిపారు.

## మారెమ్మవాడలో గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమం.

అన్నదాత దేశపాక కృష్ణ స్వామి వసంత కుటుంబ సభ్యులు.




**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు సెప్టెంబర్ 20 :**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని మారెమ్మవాడ కాలనీలో యువ స్టార్ యూత్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేశపాక కృష్ణస్వామి--వసంత కుటుంబ సభ్యులు గణేష్ మహారాజుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణేష్ మండపం వద్ద భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గణేష్ మహారాజుకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. అన్నదాన కార్యక్రమంలో కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేశపాక కృష్ణస్వామి బంధుమిత్రులు, స్నేహితులు కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాద వితరణలో సహకరించారు. మహిళలు సైతం అధిక సంఖ్యలో పాల్గొని గణేష్ మహారాజును దర్శించుకున్నారు. యువ స్టార్ యూత్ కమిటీ సభ్యులు కార్యక్రమానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఉత్సాహంగా కొనసాగింది. ఈ కార్యక్రమం ద్వారా కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## బెక్కెం నేలబిల్కులో మద్యం వేలం గ్రామ తీర్మానానికి విరుద్ధమా

- మద్యపాన నిషేధానికి సర్పంచ్, వార్డు సభ్యుల తీర్మానం
- రైతు కమిటీ ఆధ్వర్యంలో వేలం నిర్వహణపై ప్రజాగ్రహం
- ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యమివ్వాలంటున్న స్థానికులు



**సికే న్యూస్ కొల్లాపూర్ ప్రతినిధి :**చిన్నంబావి మండల కేంద్రంలోని బెక్కెం నేలబిల్కు గ్రామంలో మద్యం విక్రయాలకు సంబంధించిన వ్యవహారం వివాదాస్పదంగా మారింది. గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు కలిసి గ్రామంలో మద్యపాన నిషేధం అమలు చేయాలని తీర్మానం చేసిన నేపథ్యంలో, రైతు కమిటీ ఆధ్వర్యంలో బెల్ట్‌షాపు వేలం నిర్వహించినట్లు సమాచారం రావడం చర్చనీయాంశంగా మారింది. గ్రామంలో మద్యం విక్రయాల వల్ల ప్రజలు, ముఖ్యంగా కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే అభిప్రాయంతో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు మద్యపాన నిషేధానికి అనుకూలంగా తీర్మానం చేసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తీసుకున్న ఈ నిర్ణయాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని వారు అంటున్నారు. అయితే మరోవైపు రైతు కమిటీ ఆధ్వర్యంలో బెల్ట్‌షాపు వేలం నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు సమాచారం వెలువడటంతో గ్రామంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామ పాలకవర్గం చేసిన తీర్మానాన్ని పట్టించుకోకుండా వేలం నిర్వహించడం సముచితమా? అంటూ పలువురు గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. తీర్మానానికి విలువ లేదా గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు ఏకగ్రీవంగా లేదా అధికారికంగా చేసిన తీర్మానానికి సంబంధించి తదుపరి చర్యలు ఎలా ఉండాలి, గ్రామంలో మద్యం విక్రయాలకు అనుమతులు, బెల్ట్‌షాపుల నిర్వహణపై ప్రభుత్వ నిబంధనలు ఏమిటి, అనే అంశాలపై కూడా స్పష్టత అవసరమని స్థానికులు కోరుతున్నారు. గ్రామంలో శాంతియుత వాతావరణం, కుటుంబాల సంక్షేమం, యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల తీర్మానం అమలులో ఉందా? రైతు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు చెబుతున్న వేలానికి అధికారిక అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు. గ్రామ పాలకవర్గ తీర్మానం ఒకవైపు రైతు కమిటీ చర్యలు మరోవైపు ఉండటంతో బెక్కెం నేలబిల్కులో మద్యం దుకాణం వ్యవహారం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను వెల్లడించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కొత్తగూడ ఇన్‌చార్జ్ ఖీ=ూగా ప్రసాదరావు




**సెప్టెంబర్ 20 సికె న్యూస్ మహబూబాబాద్ జిల్లా (పతినిధి: దుర్గం మురళి**
మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా ప్రసాదరావు ఇన్‌చార్జ్ బాధ్యతలు స్వీకరించారు.ప్రస్తుతం గూడూరు ఖీ=ూగా కొనసాగుతున్న ప్రసాదరావుకు కొత్తగూడ అదనపు బాధ్యతలు అప్పగించారు.ఇటీవల టేకు కల్ప వివాదం నేపథ్యంలో కొత్తగూడలో పనిచేసిన అటవీశాఖ అధికారులను సస్పెండ్ కావడంతో... ప్రసాదరావును ఇన్‌చార్జ్ ఖీ=ూగా నియమించారు.

## రేపల్లెవాడ బిసి కాలనీలో అన్నదాన కార్యక్రమం.

- ముఖ్య అతిథులు ఏఎస్ఐ లక్ష్మణ్ చౌదరి ఢ సర్పంచ్ మడిపల్లి అంబిక



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**రేపల్లెవాడ గ్రామంలో బీసీ కాలనీలో శ్రీ సిద్ధి విఘ్నేశ్వర స్వామి ఉత్సవాలు భాగంగా జరిగిన అన్నదాన కార్యక్రమం పాల్గొన్న ఏఎస్ఐ లక్ష్మీ చౌదరి రేపల్లెవాడ సర్పంచ్ మడిపల్లి అంబికా గ్రామ ప్రజలు సంతోషంగా వారు చేసే పనుల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా పనులన్నీ ముందుకు సాగాలని ఆ వినాయకుడిని కోరుకున్నారు అలాగే అన్ని దానాల్లో కన్నా అన్నదానం గొప్పది కొనియాడారు ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించబడిన బండి రామారావు కృష్ణకుమారి దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో గణేష్ యూత్ సభ్యులు గ్రామ పెద్దలు గ్రామ తదితరులు ప్రజలు పాల్గొన్నారు

# గణపయ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే శ్రీ చౌలపల్లి ప్రతాప్ రెడ్డి గారు
- పలు కాలనీల్లో కొలువుదీరిన గణపయ్య.. మండపాలకు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి గారు సందర్శన



**షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు సీకే న్యూస్ ప్రతినిధి సెప్టెంబర్ 20 :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపల్ పట్టణంలో పలు వార్డ్ ల్లో ఏర్పాటు చేసిన గణపయ్య మండపాలను సందర్శించి నియోజకవర్గ ప్రజలందరిపై గణపయ్య ఆశీస్సులు ఉండాలని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి గారు ఆ గణనాథున్ని వేడుకున్నట్టు తెలిపారు. ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని మరియు ఫరూఖ్‌నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను మాజీ ఎమ్మెల్యే శ్రీ చౌలపల్లి ప్రతాప్ రెడ్డి గారు సందర్శించారు. ఆయా మండపాల్లో జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో, అన్నప్రసాదా కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు, మాజీ ఎమ్మెల్యే గారిని శాలువతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.. మాజీ ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణ, భక్తుల కోసం చేపడుతున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. వినాయక ఉత్సవాలను చక్కగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ప్రతి కాలనీలో వినాయక ఉత్సవాలు ప్రజల భాగస్వామ్యంతో ఉత్సాహంగా కొనసాగుతుండటం సంతోషకరమని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి గారు అన్నారు. ఉత్సవాల సందర్భంగా యువత చూపుతున్న చొరవను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గారితో పాటు షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగనూరు బస్వం, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనుర్ విశ్వం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాబర్ ఖాన్ వీరితో పాటు కౌన్సిలర్లు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీ వాసులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## విఘ్నేశ్వరుని అనుగ్రహంతో విఘ్నాలు తొలగాలి



- సిడి తాండ సర్పంచ్ గబ్రు చౌహాన్
- నాట్కో కోటర్స్ లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు
- సర్పంచ్ గబ్రు చౌహాన్ భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు

**షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు సి కే న్యూస్ ప్రతినిధి సెప్టెంబర్ 20 :** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం నందిగామ మండలం సిడి తండ గ్రామపంచాయతీలోని విగ్నేశ్వరుని అనుగ్రహంతో విఘ్నాలు తొలగి ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని సిడి తాండ సర్పంచ్ గబ్రు చౌహాన్ ఆకాంక్షించారు. నందిగామ మండలంలోని సిడి తండ గ్రామపంచాయతీ పరిధిలోని నాట్కో కోటర్స్ లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పూజా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ గబ్రు చౌహాన్ హాజరై ప్రత్యేకపూజలుచేశారు. అనంతరం భక్తులకు సర్పంచ్ సొంత నిధులతోఅన్నదానకార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.ఏ శుభకార్యం తలపెట్టినా,ఏ నూతన పనిని ప్రారంభించిన ముందుగా పూజలందుకునే ఆదిదేవుడు,విఘ్నేశ్వరుడని,మన జీవితంలో ఎదురయ్యే ఎటువంటి అడ్డంకులనైనా తొలగించి,విజయ తీరాలకు చేర్చే శక్తి గణనాథునికే ఉందని. బుద్ధికి,సిద్ధికి అధిపతి అయిన ఆ లంబోదరుని అనుగ్రహం ఉంటే కొండంత కష్టమైన మంచులా కరిగిపోతుందని భక్తుల బలమైన నమ్మకమని ఆయనఅన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు బుజ్జి శంకర్,శ్రీను బుజ్జి,శాంతి శ్రీనివాస్నాయక్,బిలక్ష్మీనారాయణ,పూర్ణచందర్,బుచ్చిబాబు, గాజులపల్లికృష్ణ,రామ్మోహన్,తులసి దాస్, సిహెచ్ శ్రీనివాస్,శరత్ రెడ్డి,సయ్యద్ సమీర్,తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్ రావు ఇంటికి కేటీఆర్



**కుటుంబ సభ్యులతో ఆత్మీయ పలకరింపు**

**సి కె న్యూస్ కొల్లాపూర్ ప్రతినిధి:**కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి బీరం లక్ష్మారెడ్డి మృతి నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, బీరం హర్షవర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. శనివారం సింగోటంలో జరిగిన పరామర్శ కార్యక్రమంలో బీరం లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, బీరం హర్షవర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం తిరుగు ప్రయాణంలో మార్గమధ్యలో చిన్నంబావి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్ రావు ఇంటికి కేటీఆర్ వెళ్లారు. ఈ సందర్భంగా రంగినేని అభిలాష్ రావు కుటుంబ సభ్యులతో కేటీఆర్ ఆత్మీయంగా పలకరించారు. కొద్దిసేపు వారితో ముచ్చటించి అనంతరం అక్కడి నుంచి బయలుదేరారు. అనంతరం కాసేపు చిన్నంబావి తల సీనియర్ నాయకులతో, కార్యకర్తలతో, వివిధ గ్రామాలకు వచ్చిన ప్రజల తో ఆప్యాయంగా పలకరిస్తూ మండలంలోని పరిస్థితుల గురించి వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో చిన్నంబాయి మండల సీనియర్ నాయకులు ఉమ్మడి మండలాల ఇన్చార్జి గోవింద శ్రీధర్ రెడ్డి, మండల మాజీ అధ్యక్షులు గజే ఈదన్న యాదవ్, మాజీ జెడ్పిటిసి కేసిరెడ్డి వెంకటరమణమ్మ, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, సర్పంచులు, పసుపుల దివ్యశ్రీ రంజిత్ కుమార్, నరసింహ, మద్దూరి శంకర్ సీనియర్ నాయకులు చిన్నారెడ్డి, వడ్డేమాన్ రామకృష్ణ, తగరం ఆటో కుర్మయ్య, మాజీ ఎంపీటీసీ లక్ష్మీ కుర్మయ్య, గూడెపు శివారెడ్డి, కార్యకర్తలు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విశ్వకర్మల హక్కుల కోసం 1700 కి.మీ మహా పాదయాత్ర: చేగుంటలో ఘన స్వాగతం




**సెప్టెంబర్ 20 (సీ కే న్యూస్) చేగుంట:**మెదక్ జిల్లా, చేగుంట మండలం, దేశవ్యాప్తంగా విశ్వకర్మల ఐక్యత, సాంస్కృతిక వైభవ పునరుద్ధరణ, సామాజిక సాధికారత, రాజకీయ ప్రాతినిధ్యం సాధించడమే లక్ష్యంగా చేపట్టిన 1700 కిలోమీటర్ల విశ్వకర్మ మహా పాదయాత్రకు ఆదివారం చేగుంట పట్టణ కేంద్రంలో ఘన స్వాగతం లభించింది. హైదరాబాద్ బోరబండ నుంచి ఢిల్లీ వరకు సాగుతున్న ఈ యాత్ర 4వ రోజుకు చేరుకోగా, స్థానిక విశ్వకర్మలు, ప్రజాప్రతినిధులు యాత్ర బృందానికి ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అనంతరం సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, దాసోజీ వీరబ్రహ్మం గాంధీ చౌరస్తా వద్ద జెండా ఊపి చేగుంట నుంచి పాదయాత్రను తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ విశ్వనాథుల పుష్పగిరి, ప్రముఖ నాయకులు దాసోజు పరిపూర్ణ చారి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం మాట్లాడుతూ.. దేశ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్న విశ్వకర్మలకు రాజ్యాధికారంలో తగిన ప్రాతినిధ్యం, రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించాలన్నారు. ఢిల్లీ వరకు సాగే ఈ యాత్ర ద్వారా విశ్వకర్మల సమస్యలను జాతీయ స్థాయికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాచారం గుట్ట అన్నదాన సత్రం ఉపాధ్యక్షులు దాసోజీ వీరబ్రహ్మం, మహంకాళి ఆలయ చైర్మన్ సంద్రుగు సతీష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్ల నవీన్ కుమార్, విశ్వకర్మ సంఘం మండల అధ్యక్షుడు పుల్లూరి నర్సింహాచారి, నాయకులు గొట్టాల నరేష్ చారి, చికోడు శ్రీనివాస్ చారి, వడ్ల మహేష్, దాసోజీ కృష్ణమూర్తి, బాణాల వెంకటేష్ చారి, కందుకూరి శంకర్ చారి తదితరులు పాల్గొన్నారు.

# మాలజాతి ముద్దుబిడ్డకు కన్నీటి వీడ్కోలు

- అభినవ అంబేద్కర్‌గా కీర్తి గడించిన ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ జగదీశ్ మృతి
- రోడ్డు ప్రమాదంలో దుర్మరణం.. యావత్ ఖమ్మం జిల్లా దిగ్భ్రాంతి
- వేలాది ప్రాణాలకు భరోసానిచ్చిన వైద్యుడి ఆకస్మిక మృతి.. కన్నీరుమున్నీరవుతున్న మాలజాతి

**సి కే న్యూస్ ఖమ్మం :**ఖమ్మం : మాలజాతి ముద్దుబిడ్డ.. వైద్యరంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ జగదీశ్ ఇక లేరు. రోడ్డు ప్రమాదంలో ఆయన దుర్మరణం చెందడంతో యావత్ ఖమ్మం జిల్లా తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఆయన మృతివార్తతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, అభిమానులతో పాటు మాలజాతి కన్నీరుమున్నీరవుతోంది.

మమతా హాస్పిటల్‌లో న్యూరో సర్జన్ హెచ్‌ఓడీగా సేవలందించిన డాక్టర్ జగదీశ్.. ఎన్నో క్లిష్టమైన న్యూరో శస్త్రచికిత్సలు నిర్వహించి అనేక మంది ప్రాణాలను కాపాడిన వైద్యుడిగా పేరు సంపాదించుకున్నారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్యం అందిస్తూ వారి కుటుంబాల్లో ఆశలు నింపిన వైద్యుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. వైద్య వృత్తిని కేవలం ఉపాధిగా కాకుండా సేవగా భావించిన డాక్టర్ జగదీశ్.. సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలకు అండగా నిలిచారని ఆయనను పరిచయం ఉన్నవారు గుర్తుచేసుకుంటున్నారు. తన ప్రతిభతో వైద్యరంగంలో ఎదగడంతో పాటు సామాజికంగా కూడా ప్రత్యేక ముద్ర వేసుకున్న ఆయనను పలువురు అభినవ అంబేద్కర్' గా కీర్తించేవారు.

ఒక్క ప్రమాదం.. ఎన్నో గుండెల్లో విషాదం

ఎందరో ప్రాణాలను కాపాడిన వైద్యుడి ప్రాణమే రోడ్డు ప్రమాదంలో అనంతలోకాలకు వెళ్లడం విషాదాన్ని మరింత పెంచింది. ఆయన ఆకస్మిక మృతితో ఖమ్మం జిల్లా వైద్యరంగంతో పాటు సామాజిక వర్గాల్లోనూ విషాదఛాయలు అలుముకున్నాయి.

మాలజాతి కన్నీటి నివాళి

డాక్టర్ జగదీశ్ మృతి మాలజాతికి తీరని లోటని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ జాతి నుంచి ఎదిగి ప్రముఖ



వైద్యుడిగా వేలాది కుటుంబాలకు సేవలందించిన వ్యక్తిని కోల్పోవడం జీర్ణించుకోలేకపోతున్నామని కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆయన మరణవార్తతో మాలజాతి శోకసంద్రంలో మునిగిపోయింది. మాలజాతి ముద్దుబిడ్డకు కన్నీటి వీడ్కోలు పలుకుతూ.. ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పిస్తోంది.

డాక్టర్ జగదీశ్ ఆకస్మిక మృతి ఆయన కుటుంబానికే కాదు.. ఆయన వైద్యసేవలు పొందిన వేలాది కుటుంబాలకు,

## ధనలక్ష్మి దశదిన కర్మకు మత్కేపల్లి మార్కెట్ చైర్మన్ అంబటి.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** శ్రీ వెంకట్రామా జ్యువెలర్స్ ఖమ్మం అధినేత రాయపూడి వెంకట రామారావు మాతృమూర్తి రాయపూడి ధనలక్ష్మి దశదిన కర్మ కార్యక్రమం నాగులవంచలో నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రముఖులు హాజరై ధనలక్ష్మి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. మత్కేపల్లి మార్కెట్ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, ఆలస్యం బసవయ్య,సామినేని అప్పారావు, పసుమర్తి రామ్మోహన్, కోలేటి పెద్ద బ్రహ్మం, చిన్న బ్రహ్మం, వెచ్చ మంగపతిరావు, తోటకూరి వెంకట నరసయ, ఆలస్యం రవి, కొమ్మినేని వెంకటేశ్వరరావు, ఎల్లంపల్లి అప్పారావు, నెల్లూరి రమేష్,ఆలస్యం శ్రీనివాస్ రావు, శిలివేరు సైదులు, పాల రాజు, మంకెని వీరయ, అంబటి రవికుమార్, ఆలస్యం శంకర్ చౌదరి తదితరులు హాజరై కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.ద

## పాలమూరుపై కేటీఆర్ కు ఎక్కడ లేని ప్రేమ...

- శవ రాజకీయాలు చేస్తున్న కేటీఆర్...
- 'కేటీఆర్' అనే పేరు కంటే 'డ్రామారావు' అనే పేరు సరిపోతుంది...
- తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ నాయకులు



**పెబ్బేరు సెప్టెంబర్20 (సి కే న్యూస్)** పాలమూరు పర్యటనలో కేటీఆర్ శవ రాజకీయాలు చేస్తున్నారని, ఆయనకు 'డ్రామారావు' పేరు సరిగ్గా సరిపోతుందని పెబ్బేరు కాంగ్రెస్ నాయకులు విమర్శించారు.పాలమూరు ప్రాంతంపై కేటీఆర్‌కు ఇప్పుడు ఎక్కడ లేని ప్రేమ పుట్టుకొచ్చిందని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. కొల్లాపూర్‌లో మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి తండ్రి మృతదేహాన్ని పరామర్శించేందుకు వచ్చిన కేటీఆర్ అక్కడ కూడా రాజకీయ వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. మృతుల విషయంలో కూడా రాజకీయాలు చేయడం తగదని, కేటీఆర్ శవ రాజకీయాలు చేస్తున్నారని వారు ఆరోపించారు.కేటీఆర్‌కు 'కేటీఆర్' అనే పేరు కంటే 'డ్రామారావు' అనే పేరు సరిపోతుందని కాంగ్రెస్ నాయకులు ఘాటు వ్యాఖ్యలు చేశారు.మహనీయుడైన ఎన్టీఆర్ పేరులోని 'రామారావు' పేరును పెట్టుకుని ఆయనకు చెడ్డపేరు తీసుకురావద్దని అన్నారు. 'రామారావు కాదు.. డ్రామారావు' అనే పేరు కేటీఆర్‌కు సరిపోతుందని విమర్శించారు. ఫామ్‌హౌస్ చుట్టూ వేల ఎకరాల భూములకు సంబంధించిన వ్యవహారాలపై కూడా కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆరోపణలు చేశారు.సామాన్య ప్రజలకు సంబంధించిన భూముల విషయంలో అక్రమాలు జరిగితే ఊరుకునేది లేదని, త్వరలోనే వాటికి సంబంధించిన లెక్కలు తేలుతాయని హెచ్చరించారు.గుమ్మడం ప్రాంతంలో విద్యుత్ సరఫరాపై కూడా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు ఖండించారు. అక్కడ విద్యుత్ సరఫరా విషయంలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. రైతుల పేరుతో ధర్నా నిర్వహిస్తామని చెప్పి, తగిన సంఖ్యలో రైతులు రాకపోవడంతో ఇతరులను తీసుకొచ్చి విద్యుత్ కార్యాలయాన్ని సందర్శించి తప్పుడు ప్రచారం చేశారని విమర్శించారు. పెబ్బేరులో కేటీఆర్ అడుగుపెట్టిన సమయంలో వర్షం కురవడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు కేటీఆర్ వచ్చినందుకే వర్షం వచ్చిందని ప్రచారం చేస్తున్నారని.. వర్షాలు పడని ప్రాంతాల్లో కూడా కేటీఆర్ పర్యటిస్తే అక్కడ కూడా వర్షాలు పడతాయేమో చూడాలని కాంగ్రెస్ నాయకులు ఎద్దేవా చేశారు. ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలపై కేటీఆర్ తప్పుడు లెక్కలు చెబుతూ ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. జూరాల ప్రాజెక్టు నీటి సామర్థ్యంపై కూడా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను వారు తప్పుబట్టారు. రైతుల పట్ల నిజమైన శ్రద్ధ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నవారు అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలపై గళమెత్తాలని, సభకు హాజరుకాకుండా ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేయడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్,పార్టీ మండల అధ్యక్షుడు యాపర్ల రామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి,మాలపల్లె సర్పంచ్ అశోక్, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ విజయవర్ధన్ రెడ్డి,నాయకులు రంజిత్ కుమార్,సురేందర్ గౌడ్, వెంకటేష్ సాగర్,యుగంధర్ రెడ్డి,నరేందర్,శ్రీహరి,విష్ణు,రాములు,రాజు,ఉత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

## త్రిబుల్ ఆర్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలి.

- బిజెపి పార్టీ జిల్లా నాయకులు మంద నర్సింహ ముదిరాజ్ సంఘం గ్రామం.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి సెప్టెంబర్ 20.:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంఘం గ్రామంలో బీజేపీ జిల్లా నాయకులు మంద నరసింహ ముదిరాజ్ మీడియాతో మాట్లాడారు. గౌరెల్లి--భద్రాచలం నేషనల్ హైవే నిర్మాణం కోసం పోచంపల్లి, వలిగొండ మండలాల్లో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని కోరారు.భూసేకరణ పరిహారాన్ని అర్బిట్రేషన్ ద్వారా పునఃపరిశీలించి రైతులకు సముచిత న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.
ప్రస్తుతం ఎకరాకు సుమారు రూ.11 లక్షల నుంచి రూ.29 లక్షల వరకు మాత్రమే నష్టపరిహారం అందిస్తున్నారని తెలిపారు. అదే భూములకు బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రూ.కోటి నుంచి రూ.3 కోట్ల వరకు విలువ ఉందని పేర్కొన్నారు.
రైతులకు కనీసం రూ.38 లక్షల నుంచి రూ.1.20 కోట్ల వరకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. పోచంపల్లి, వలిగొండ మండలాల్లోని భూబాధిత రైతుల పరిహారాన్ని ప్రస్తుత మార్కెట్ విలువల ఆధారంగా పునఃపరిశీలించాలని అన్నారు.
భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు న్యాయమైన, సముచితమైన పరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. భూములు కోల్పోతున్న రైతుల సమస్యలను అధికారులు, ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.
రైతులకు న్యాయం జరిగే వరకు వారి సమస్యలపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని మంద నరసింహ ముదిరాజ్ తెలిపారు.

# పందిళ్ళపల్లి శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం

- అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ జోనల్ ఇంచార్జ్ ఇనుకుళ్ళ నాగ సురారెడ్డి
- 1,60,000 రూపాయలతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేసిన అలవాల కొండయ్య- పుష్ప దంపతులు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** సెప్టెంబర్ 20: చింతకాని మండల పరిధిలోని పందిళ్ళపల్లి పాత బొడ్రాయి సెంటర్లోని శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అలవాల కొండయ్య- పుష్ప దంపతులు కుమారుడు అలవాల గోపీనాథ్ 1,60,000 రూపాయలు అన్నదాన కార్యక్రమానికి వితరణగా అందజేశారు. మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఇనుకుళ్ళ నాగసురారెడ్డి మాట్లాడుతూ భక్తిశ్రద్ధలు, క్రమశిక్షణగా వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ పాత బొడ్రాయి సెంటర్ యూత్ ను అభినందించారు. అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో విలువైనదని కొనియాడారు. తన సొంత డబ్బుతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయించిన అలవాల కొండయ్య- పుష్ప దంపతులు కుమారుడు గోపీనాథ్ అందించారు. నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాకులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక పోలీస్ నియమ నిబంధనల లోబడి నిమజ్జనా కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు అలవాల జనార్ధన్ రావు, చల్లా బద్రారెడ్డి, మధిర శ్రీనివాస్ రెడ్డి, మందటి నరేష్, ఇనుకుల్ల బ్రహ్మ రెడ్డి,లింగం రాంబాబు, కొండపరెడ్డి రవీందర్ రెడ్డి, వార్డు మెంబర్ మండే రామలింగయ్య, మండే శ్రీనివాసరావు, కొమ్మినేని నాగేశ్వరరావు, దారగాని రామారావు, అలవాల వెంకట నరసయ్య, లింగం రంగారావు, రేకం వెంకటేశ్వర్లు,మండే చంద్రయ్య,యడ్ల భద్రయ్య, శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మరీదు వంశీకృష్ణ, ఉత్సవ కమిటీ యూత్ సభ్యులు రేఖం హరీష్, మండే ఉదయ్ కిరణ్ మండే సతీష్, వత్సవాయి కోటి, వత్సవాయి కిరణ్, వత్సవాయి అనిల్,రేఖం నరేందర్, మండే వేణు, అలవాల ఉదయ్ నవీన్, అలవాల జయంత్, అలవాల విగ్నేష్, బాల గోపి, అలవాల అవినాష్, సతీష్ బాల సతీష్ బాల సాయి నిఖిల్, మండే కోటి రామేశ్వరరావు, వత్సవాయి కోటేశ్వరరావు, వినాయక విగ్రహ దాత గోనె గోపి - రాజ్ భార్గవి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో ఘనంగా "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమం





**మధిర సెప్టెంబర్ 20(సికె న్యూస్)ప్రతినిధి.** పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా, ఖమ్మం జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు కిష్టాపురం లోగల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర గురుకుల పాఠశాల/ కళాశాల ముదిగొండ లో శనివారం ప్రిన్సిపాల్ డా. టీ. రాములు, వైస్ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు,ఆధ్వర్యంలో "ఏక్ పేడ్ మా కే నామ్" (అమ్మ పేరిట ఒక మొక్క)" కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు.విద్యార్థులు తమ తల్లుల గౌరవార్థం, వారి తల్లిదండ్రుల సమక్షంలోనే మొక్కలు నాటి, వాటిని తమ సొంత బిడ్డలా సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అమ్మకు, ప్రకృతికి ఉన్న అనుబంధాన్ని చాటేలా ఈ కార్యక్రమం సాగింది.ముఖ్య అతిథులుగా పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు లికర్నాటి రామారవు, గ్రామ సర్పంచ్ భూక్యా నాగేశ్వరరావు, లు ఆవరణలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి పెంచడం ద్వారా గ్లోబల్ వార్మింగ్, కాలుష్యాన్ని తగ్గించవచ్చు. ద్వారా ఆక్సిజన్ పెరుగుతుందన్నారు. విద్యార్థి దశ నుండే పర్యావరణ స్పృహ కలిగి ఉండటం అభినందనీయం" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జెవిపి కె. సంజీవ రావు,
ఉప సర్పంచ్ కొత్తపల్లి నరసింహారావు ఫీల్డ్ అస్టెంట్ బుర్రి ప్రసాదరావు,కిష్టాపురం పంచాయితీ కార్యదర్శి జె.రమేష్
అధ్యాపకులు సత్యం,లింగాల నరేష్, బొక్క నాగేశ్వరరావు, సాంసన్, యమ్ .మహేష్, అనిల్,శరత్, రామాచారి,కె. నాగేశ్వరరావుసుధాకర్ కృష్ణమూర్తి, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్ఐ జి. నరేష్.







**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండలం తిరుమలాపురం గ్రామంలో యువశక్తి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 25వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ సిద్ధి వినాయక స్వామి అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చింతకాని ఎస్ఐ జి. నరేష్అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు.
అంతకుముందు లక్ష్మీకాంత్ అయ్యగారి ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్ఐ జి. నరేష్ ప్రత్యేక పూజల్లో పాల్గొని శ్రీ సిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు.
ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు ఆధ్వర్యంలో యువశక్తి యువజన సంఘం కమిటీ సభ్యులు, నిర్వాహకులు ఎస్ఐ జి. నరేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. సర్పంచ్ వీరబాబు ప్రత్యేకంగా ఎస్ఐను ఆహ్వానించి కార్యక్రమంలో పాల్గొనడం పట్ల కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ సందర్భంగా ఎస్ఐ జి. నరేష్ మాట్లాడుతూ గ్రామస్తులు ఐకమత్యంతో పండుగలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. పండుగల సందర్భంగా యువత, గ్రామస్తులు పరస్పరం సహకరించుకుంటూ శాంతిభద్రతలకు సహకరించాలని కోరారు.వినాయక నవరాత్రుల సందర్భంగా భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో యువశక్తి యువజన సంఘం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భారత్ రక్తదాన్ ఉత్తమ సేవా పురస్కారం 2026 అందుకున్న ఆదరణ ఫౌండేషన్ నిస్సి



**మధిర సెప్టెంబర్ 20(సికె న్యూస్)ప్రతినిధి.** తెలంగాణ రాష్ట్రం భువనగిరి యాదాద్రి జిల్లా ఆత్మకూర్ పట్టణంలోని పి యస్ పంక్షన్ హాల్ నందు భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ వారు ఆదివారం దక్షణ భారతదేశం లోని ఐదు రాష్టాలలోని రక్తదాతలకు సామాజిక సేవకులకు ఉత్తమ సేవా పురస్కారం సన్మానం ఏర్పాటు చేశారు కార్యక్రమంలో ముఖ్య అతిధులు 320 సార్లు రక్తదానం చేసి ప్రపంచ స్థాయి పేరుగాంచిన సంపత్ కుమార్ సంస్థ వ్యవస్థాపకులు కురిమేటి నవీన్ సర్వే నీడ్ గౌతమ్ గార్ల చేతులమీదుగా ఆదరణ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నిస్సి ఉత్తమ సేవా పురస్కారం 2026 అందుకున్నారు మధిర పట్టణంలో మధిర రెస్క్యూ టీం ను స్థాపించి రోడ్డు యాక్సిడెంట్లో గాయపడిన వారిని హాస్పిటల్ లో చేర్చడం అత్యవసర పరిస్థితుల్లో రక్తశీ అవసరమైన వారికి దాతలు సహకారంతో రక్తం అందించడం అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించడం ఫంక్షన్లలో మిగిలిపోయిన ఆహారాన్ని పేదలకి అందించడం పాత బట్టలను సేకరించి అడవి ప్రాంతంలో ఉన్న వారికి అందించడం మరి ముఖ్యంగా ఆదరణ సేవ వృద్ధుల ఆశ్రమం స్థాపించి ఎంతోమంది వృద్ధులకు వసతి కల్పించి సేవ చేస్తున్నందుకు గాను ఈ అవార్డును అందించడం జరిగిందిఈ అ వార్డ్ అందించిన కే నవీన్ గారికి వారి కమిటీకి సంస్థ కు ఆదరణ ఫౌండేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు ఈ అవార్డ్ అందుకున్న నిస్సి కి పలువురు అభినందనలు తెలిపారు.

## నిరుపేదలకు "వికలాంగులు కు" దుస్తులు పంపిణీ



**మధిర సెప్టెంబర్ 20(సికె న్యూస్)ప్రతినిధి.** మధిర టౌన్ సెప్టెంబర్ 20: ఆదివారం ఉదయం మధిర పట్టణంలో స్థానిక అజాద్ రోడ్ లో సంఘ సేవకుడు లంకా కొండయ్య బృందం నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ ఓల్డ్ క్లాత్ బ్యాంక్, హెల్పింగ్ హోమ్ ద్వారా నిరు పేదలకు వికలాంగులకు వివిధ దయార్ద హృదయులు అందించిన దుస్తులు, బెడ్ షీట్ లను కొండయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో దాతలు ప్రముఖ రైతు సోదరులు కాకతీయ కమ్మజన సేవా సమితి సభ్యులు, మానవతా వాది బిక్కి వెంకట రమణారావు, వెలగపూడి సురేంద్ర, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గం వారు తమ ఇండ్లలో మిగిలిన దుస్తులు కొండ య్యకు అందజేయగా వాటిని ఈరోజు నిరుపేదలకు పంచి పెట్టి మానవత్వం చాటుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో లంకా సేవాఫౌండషన్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి



- గణనాథులను దర్శించుకున్న డీసీసీ అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్ నాయక్
- వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు....అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్,పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి.మహిపాల్ రెడ్డి

**సికే న్యూస్ పెద్దేముల్ ప్రతినిధి , సెప్టెంబర్ 20:**వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీసీసీ అధ్యక్షులు ధారాసింగ్ అన్నారు. ఆదివారం పెద్దేముల్ మండలంలోని గాజీపూర్, హన్మాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పినెముల మహిపాల్ రెడ్డి, తాండూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షుడు లొంక నర్సింహులు లతో కలిసి సందర్శించి ఉత్సవాల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు జాదవ్ ధారాసింగ్ నాయక్‌తో పాటు తదితరులను ఘనంగా సన్మానించారు. వినాయక ఉత్సవాల సందర్భంగా మండపాల నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో జాదవ్ ధారాసింగ్ నాయక్ పాల్గొని భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.

ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్ నాయక్ మాట్లాడుతూ.....గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో ప్రజలంతా ఐకమత్యంతో పండుగలను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. వినాయక మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా భక్తి భావంతో పాటు సేవా స్ఫూర్తిని చాటుతున్నారని కొనియాడారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పేలా ఉత్సవాలను ఐకమత్యంతో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎల్లప్ప, కాంగ్రెస్ నాయకులు ప్రకాష్ రెడ్డి, సంగమేశ్వర్, నాగభూషణం, నాగప్ప, వెంకటేష్, ఉత్సవ కమిటీ నిర్వాహకులు శ్రీనివాస్, బాలు, నవీన్, జగదీష్, మహేష్, శ్రీశైలం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో పలు గణేష్ మండపాలని దర్శించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- గణేష్ నవ రాత్రులు భక్తి వైభవానికి ప్రతీకలు
- షాద్‌నగర్‌లో గణేష్ మండపాలను సందర్శించి స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు.. నిర్వాహకులకు అభినందనలు



**షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు సి కె న్యూస్ ప్రతినిధి సెప్టెంబర్ 20:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో గణేష్ నవ రాత్రులు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. గణనాథుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటూ భక్తులు ప్రత్యేక పూజలు, భజనలు, అన్నదాన కార్యక్రమాలతో, ఆధ్యాత్మిక,వాతావరణాన్ని నెలకొల్పుతున్నారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పట్టణంలోని పలు గణేష్ మండపాలను సందర్శించి విఘ్నేశ్వరుడిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిప్రజలందరూసుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతోఉండాలని ఆకాంక్షించారు,ఎమ్మెల్యే శంకర్ వెంట పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అనుచరులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా మండపాల వద్దకు చేరుకున్న ఎమ్మెల్యేకు నిర్వాహకులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న మండపాల నిర్వాహకులనుఆయనఅభినందించారు. గణేష్ నవ రాత్రులు భక్తి, ఐక్యత, ఆధ్యాత్మికతకు ప్రతీకలని, విఘ్నాలను తొలగించే గణనాథుడి కృపతో ప్రజలందరికీ శుభం కలగాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. పట్టణంలో ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తి భావంతో కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

# గజానన మహోత్సవంలో భాగంగా గణపతి ని దర్శించుకున్న ఎమ్మెల్యే



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :** ఈరోజు గద్వాల పట్టణంలోని 6వ వార్డు కొత్త హౌసింగ్ బోర్డ్ కాలనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి గణేష్ ఉత్సవాల్లో పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి హాజరయ్యారు. గజానన మహోత్సవంలో భాగంగా గణపతి మండపంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు, తీర్థప్రసాదాలు తీసుకోవడం జరిగినది.

ఎమ్మెల్యే గారికి గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ....

ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని ప్రతి సంవత్సరం జరుపుకోవాలి మట్టి వినాయకుడిని పూజించాలి పర్యావరణాన్ని కాపాడాలని అని తెలిపారు. గణేష్ ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర గద్వాల నియోజకవర్గం లో రైతులకు , దిన దిన అభివృద్ధి అభివృద్ధి చెందాలని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా స్వామి వారి కోరుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా డిసిసి అధ్యక్షులు రాజీవ్ రెడ్డి జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, బండ్ల రాజశేఖర్ రెడ్డి, మాజీ జెడ్పి చైర్మన్ బండారి భాస్కర్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్ గౌడ్ , మాజీ ఎంపీపీలు విజయ్, రాజారెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ కౌన్సిలర్స్ తుమ్మల నరసింహులు యాదవ్ , మురళి,నాయకులు రమేష్ రెడ్డి, అజయ్, మైలగడ్డ చంద్రశేఖర్, కొత్త గణేష్, రైల్వే సతీష్ నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఆవేదన.. బాసు హనుమంతు నాయుడు కి మొరపెట్టుకున్న గద్వాల రైతాంగం!

- ఎండిపోతున్న పంటలు -- అండగా నిలవాలని దీ=హ ఇన్‌చార్జ్ కి గద్వాల మండల రైతుల విజ్ఞప్తి!



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల** :గద్వాల మండల పరిధిలోని ఆయకట్టు రైతులు ఈరోజు దీ=హ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాసు హనుమంతు నాయుడు ని వారి నివాసంలో కలిసి తమ సమస్యలను వివరించారు.

సకాలంలో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, నీటి ఎద్దడి కారణంగా తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

“మా కోసం మీరే పోరాటం చేయాలి.. మేము మీకు సంపూర్ణ మద్దతుగా ఉంటాం” అని రైతులు బాసు హనుమంతు నాయుడు ని కోరారు.

రైతుల సమస్యలపై స్పందించిన బాసు హనుమంతు నాయుడు గారు, అన్నదాతలకు సాగునీరు అందేలా, రైతులకు న్యాయం జరిగే వరకు దీ=హ పార్టీ తరఫున గట్టిగా పోరాటం చేస్తామని భరోసా ఇచ్చారు.

# మట్టి గణపతిని దర్శించుకున్న మాజీ జడ్పీటీసీ, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి



బాసు శ్యామల హనుమంతు నాయుడు

**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :**ఈరోజు గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు న్యూ హౌసింగ్ బోర్డు నందు గజనన మహోత్సవం లో భాగంగా ప్రతిష్టించిన మట్టి గణనాథుడిని దర్శించుకుని,కొబ్బరికాయ కొట్టి, హారతి ఇచ్చి,ప్రత్యేక పూజలు నిర్వహించి,తీర్థ ప్రసాదాలు స్వీకరించి, స్వామి వారి ఆశీస్సులను పొందారు.... అనంతరం,కమిటీ సభ్యులు వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు....

**ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....**

ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్టించి పూజించి పర్యావరణాన్ని కాపాడాలి అని తెలిపారు..ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలన్నారు..వినాయక చవితి పర్వదినం ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావం, సేవా స్ఫూర్తిని పెంపొందించాలని ఆకాంక్షించారు..ప్రజల జీవితాల్లో ఆనందం, శాంతి, అభివృద్ధి వెల్లివిరియాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు.. .

విఘ్నేశ్వరుని ఆశీస్సులతో పట్టణ ఢ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో,పాడిపంటలతో సుఖ సంతోషంగా ఉండాలని వారు ఆకాంక్షించారు....

ఈ కార్యక్రమంలో లక్ష్మీకాంత్ రెడ్డి, బీచుపల్లి,చక్రీధర్ రెడ్డి,వెంకటేష్ నాయుడు, లక్ష్మిరెడ్డి,ఈశ్వర్,గోపాల్,అనిల్, శేఖర్ నాయుడు,శ్రీరాములు,జాంపల్లి భరత్ సింహారెడ్డి,తిరుమల, శ్రీనివాసులు, పూడూరు రఘు నాయుడు,రాముడు,తిరుమలేష్, వినయ్,మోహన్,రాము,జయరాముడు,కృష్ణ,మహేందర్, మరియు నాయకులు,కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు....

# షాద్‌నగర్‌లో ఒగ్గు డప్పులతో తీన్మార్ మల్లన్న కి ఘన స్వాగతం

## మంగళహారతులు, వీర తిలకంతో స్వాగతం పలికిన షాద్‌నగర్ ఆడబిడ్డలు



**సి కె న్యూస్ ప్రతినిది:**బీసీ రాజ్యాధికార యాత్ర రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ చేరుకున్న సందర్భంగా తీన్మార్ మల్లన్న కి స్థానిక మహిళలు ఘన స్వాగతం పలికారు. మంగళహారతులతో ఆహ్వానించి, వీర తిలకం దిద్ది తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు మల్లన్న కి స్వాగతం పలికారు. అలాగే ముదిరాజ్ మహాసభ నాయకులు తీన్మార్ మల్లన్న కి స్వాగతం పలికి, ఆయనను సత్కరించారు. అనంతరం షాద్‌నగర్ ప్రధాన కూడలిలో ఉన్న బీసీ మహనీయుల విగ్రహాలకు తీన్మార్ మల్లన్న పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహాత్మా జ్యోతిబా పూలే దంపతులు,ప్రొఫెసర్ జయశంకర్ సార్, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, పండుగ సాయన్న, డా. బిఆర్ అంబేద్కర్ ,చాకలి ఐలమ్మ, ప్రజా యుద్ధనౌక గద్దర్ విగ్రహాలకు పూలమాలలు వేసి వారి సేవలను స్మరించుకున్నారు. అనంతరం తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండా గద్దెను తీన్మార్ మల్లన్న ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముదిరాజ్ మహాసభ నాయకులు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ జగదీష్ మృతి పట్ల టీజేఏ సంతాపం

**వైద్య రంగానికి తీరని లోటు: జి. నాగస్వామి**



**సి కె న్యూస్ ప్రతినిది:**ఖమ్మం: ప్రముఖ న్యూరో సర్జన్, ఖమ్మంలోని మమత హాస్పిటల్‌లో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ కాసకుర్తి జగదీష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ (టీజేఏ) ఖమ్మం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది.

సూర్యాపేట జిల్లా పిల్లలమర్రి సమీపంలోని ఖమ్మం--హైదరాబాద్ జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో డాక్టర్ జగదీష్ ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను ఢీకొనడంతో మంటలు చెలరేగి ఆయన మృతి చెందినాడు.

డాక్టర్ జగదీష్ ఆకస్మిక మృతి వైద్య రంగానికి, ఆయనను అభిమానించే రోగులకు, సహచర వైద్యులకు, కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులకు తీరని లోటని టీజేఏ ఖమ్మం జిల్లా అధ్యక్షులు జి. నాగస్వామి పేర్కొన్నారు.

ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ ఎంతోమంది ప్రాణాలను కాపాడిన ఒక ప్రముఖ వైద్యుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. డాక్టర్ జగదీష్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు.

ఈ సందర్భంగా డాక్టర్ జగదీష్ కుటుంబ సభ్యులకు తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ ఖమ్మం జిల్లా కమిటీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో టీజేఏ జిల్లా గౌరవ అధ్యక్షులు కే మణికుమార్, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ భుక్యా ఉపేందర్, ప్రధాన కార్యదర్శి మత్తి రామకృష్ణ, ఉపాధ్యక్షులు గద్దల సుబ్బారావు వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.కె ఖాసీం, కోశాధికారి బోడపట్ల సతీష్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎండి రషీద్, కార్యదర్శి ఎం చిన్ని నాయకులు వాసం రాజేంద్రప్రసాద్, నల్లమోతు శ్రీనివాసరావు,పవన్ కుమార్, బానోత్ సురేందర్, దోమల కిరణ్, గంజి ఎంకన్న, ఎస్ కే పాషా బ్రహ్మం తదితరులు ఉన్నారు

# 5 గ్రాముల బంగారం గెలుచుకున్న దాసరి సాయమ్మ

- 1,473 మంది పాల్గొన్న లక్కీడ్రా
- రూ.100తో లాటరీ రసీదులు పొందిన ఆశావాహులు
- సర్పంచ్, ఉపసర్పంచ్ సమక్షంలో బంగారం లక్కీడ్రా
- అదృష్టం వరించి 5 గ్రాముల బంగారం గెలుచుకున్న పెద్దేముల్ గ్రామానికి చెందిన దాసరి సాయమ్మ
- బీసీ కాలనీ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉల్లాసంగా, ఉత్సాహంగా లక్కీడ్రా నిర్వహణ



**సికే న్యూస్ పెద్దేముల్ ప్రతినిధి, సెప్టెంబర్ 20:**వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండల కేంద్రంలోని బీసీ కాలనీ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బంగారం లక్కీ లాటరీ డ్రాలో పెద్దేముల్ మండల కేంద్రానికి దాసరి సాయమ్మ విజేతగా నిలిచారు. వినాయక ఉత్సవాల సందర్భంగా బీసీ కాలనీ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లక్కీ డ్రాలో మొత్తం 1,473 మంది సభ్యులు పాల్గొన్నారు. ఒక్కో లాటరీ రసీదును రూ. 100 చొప్పున విక్రయించారు. లక్కీ డ్రాలో 5 గ్రాములు (మాసాలా) బంగారం బహుమతిగా ప్రకటించగా,లక్కీ విన్నర్‌గా దాసరి సాయమ్మ ఎంపికయ్యారు. ఈ లక్కీ డ్రా ను పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై. నర్సింహులు, ఉపసర్పంచ్ డివై. ప్రసాద్ లతో పాటు వినాయక ఉత్సవ కమిటీ సభ్యుల సమక్షంలో నిర్వహించారు. విజేతగా ఎంపికైన దాసరి సాయమ్మకు ఉత్సవ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ కాలనీ వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు,కాలనీ ప్రజలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# మౌర్య సాయి చందు గారి జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ జడ్పీటీసీ

బాసు శ్యామల హనుమంతు నాయుడు



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల** :ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని లింగంబాయి కాలనీ నందు బాలసదనము లో మాజీ గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్,సింగర్ కీర్తిశేషులు సాయి చందు గారి జయంతి సందర్భంగా చిన్నారులకు అన్నదాన కార్యక్రమాన్ని బాసు శ్యామల గారు ప్రారంభించి,చిన్నారులతో కలిసి,కేక్ కట్ చేశారు...ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు శిల్పా మోనేష్,పద్మ,కేశవతి,పద్మావతి మరియు నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి,వెంకటేష్ నాయుడు,ముని మౌర్య, పూడూరు రఘు నాయుడు,రాముడు, వినయ్,గంగాధర్,మహేష్, కృష్ణ, మహేందర్, మరియు తదితరులు పాల్గొన్నారు.....

## పిఆర్సి నుంచి అన్ని డి ఎ లు ఇప్పించే బాధ్యత నాదే

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ , గద్వాల ఎమ్మెల్యే




సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :ఈరోజు గద్వాల జిల్లా అనంత ఫంక్షన్ హాల్ లో పి ఆర్ టి యు టి ఎస్ జోగులాంబ గద్వాల జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం గద్వాల నందు జిల్లా అధ్యక్షులు పచ్చర్ల తిమ్మారెడ్డి అధ్యక్షతన, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఎన్. వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అతిథులుగా లిగద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి , ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ రెడ్డి, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు బుచ్చారెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షులు పరమేశ్వర్ రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు నరసింహారెడ్డి, జి హెచ్ ఎం ఎ స్ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా జోగులాంబ గద్వాల జిల్లాలో ఉపాధ్యాయులకు అండదండగా ఉంటూ, విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి అభినందించారు.

**ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ**

రాష్ట్రంలోని ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పిఆర్సి ను మంచి ఫిట్‌మెంట్‌తో అమలు చేయించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న 6 డి ఏ లను ఇప్పించే బాధ్యత తనదేనని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి తో జరగనున్న సమావేశంలో ఉపాధ్యాయుల సమస్యలపై చర్చలు సఫలీకృతం కాకపోతే, పి ఆర్ టి యు టి ఎస్ సంఘం పక్షాన ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం కృషి చేస్తున్న సంఘం పి ఆర్ టి యు టి ఎస్

ఎమ్మెల్యే మాట్లాడుతూ..

ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ పేద విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు.ఉపాధ్యాయులపై ఉన్న విద్యా బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని ఆయన అన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావడంతో పాటు, గౌరవ ఎమ్మెల్సీ శ్రీ పింగిలి శ్రీపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీ పింగిలి శ్రీపాల్ రెడ్డిని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అభినందించారు.ఈ సమావేశంలో జిల్లా డిసిసి అధ్యక్షులు రాజీవ్ రెడ్డి ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ జంబురామన్ గౌడ, జిల్లా సీనియర్ నాయకులు రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచ్ల సంఘ అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ కౌన్సిలర్ తుమ్మల నరసింహులు యాదవ్, నాయకులు జిల్లాలోని 13 మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మండల కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర మరియు జిల్లా బాధ్యులు, పి ఆర్ టి యు టి ఎస్ ప్రాథమిక సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ శివ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శివ కళ్యాణం, అన్నదానం



ఖమ్మం, సెప్టెంబర్ 20( సి కె న్యూస్ ప్రతినిధి) ఖమ్మం నగరంలోని 49వ డివిజన్ మామిళ్ళగూడెంలో శ్రీ శివ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో శనివారం రాత్రి శివ కళ్యాణం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా ఆదివారం ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు సుధీర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

## డాక్టర్ కందుల సుధాకర్ కు అక్షర కిరీటి బిరుదు ప్రధానం

శ్రీ శ్రీ కళావేదిక జాతీయ సంస్థ భద్రాచలం ఐ టి డి ఏ పి ఓ శ్రీ రాహుల్ చేతులు మీదుగా సత్కారం



సి కె న్యూస్ ప్రతినిది: భద్రాద్రి కవిత పండుగలో ఏటపాక డాక్టర్ పాలురాజు ఇంజనీరింగ్ కళాశాల పోలవరం జిల్లా భద్రాద్రి లో నిర్వహించిన మెగా కవి సమ్మేళనంలో ఖమ్మం జిల్లా నుండి ప్రముఖ కవి రచయిత నంది అవార్డు గ్రహీత డాక్టర్ కందుల సుధాకర్ పాల్గొని చెట్టు మనసు అనే కవితను ఆలపించారు దీని గాను భద్రాచలం ఐటిడిఈ పీవో రాహుల్ మరియు శ్రీ శ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం మరియు భద్రాద్రి కమిటీ సభ్యులు అందరూ కలిసి డాక్టర్ కందుల సుధాకర్ కి అక్షర కిరిటి బిరుదును ప్రధానం చేసి,మేమెంటో మరియు సర్టిఫికెట్ ఇచ్చి శాలువా తో ఘనంగా సత్కరించారు. తనకు అక్షర కిరిటీ బిరుదులు ప్రధానం చేసిన ఐటీడీఓ పిఏ రాహుల్ కి మరియు శ్రీ శ్రీ కళావేదిక కమిటీ సభ్యులకు మరియు భద్రాద్రి కమిటీ సభ్యులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు, ఇంకా తెలుగు భాష సాహిత్యానికి అహర్నిశలు కష్టించి పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో ఐటిడీఏ పీఓ రాహుల్ మరియు ప్రముఖులు పంచాక్షరయ్య, శ్రీనాథ వంశస్థులు భక్త రామదాసు వంశస్థులు పాల్గొన్నారు,

# బీసీ రాజ్యాధికార యాత్రకు అడుగడుగునా జననీరాజనం

- నందిగామ నుంచి షాద్‌నగర్ మీదుగా మొగిలిగిద్ద వరకు ఉత్సాహంగా సాగిన 4వ రోజు యాత్ర
- నందిగామలో ఘన స్వాగతం.. షాద్‌నగర్‌లో ఒగ్గు డప్పులు, మంగళహారతులు
- చీవీల సమస్యలపై స్పందించిన తీన్మార్ మల్లన్న.. ూజుజూచీవీ దీక్షకు సంపూర్ణ మద్దతు
- ఎ=ూ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేత
- బీసీ మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి
- షాద్‌నగర్ ఎస్టీ హాస్టల్ దుస్థితిపై అధికారులను ప్రశ్నించిన మల్లన్న
- ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చేందుకు పోరాడతానని హామీ
- రెడ్లు,వెలమల దగ్గరున్న కోటి ఎకరాలను గుంజుకొని పేదలకు పంచుతాం
- 2028లో బిఆర్ఎస్,కాంగ్రెస్ పార్టీలకు శంకరగిరి మాన్యాలే
- షాద్‌నగర్ కార్నర్ మీటింగ్‌లో మల్లన్న
- మొగిలిగిద్దకు చేరుకున్న యాత్ర.. ఐదో రోజు కొండూర్గ్ వైపు పాదయాత్ర



సి కె న్యూస్ ప్రతినిది:బీసీల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, రాజ్యాధికార సాధనే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేపట్టిన 'బీసీ రాజ్యాధికార యాత్ర' నాలుగో రోజు ఉత్సాహభరితంగా కొనసాగింది. నందిగామ నుంచి షాద్‌నగర్ మీదుగా ఎలికట్టే, మొగిలిగిద్ద వరకు సాగిన యాత్రలో వివిధ వర్గాల ప్రజలు, మహిళలు, ఉద్యోగులు, సంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మల్లన్నను కలిసి తమ సమస్యలను వివరించారు.

**నందిగామలో బీసీ రాజ్యాధికార యాత్రకు ఘన స్వాగతం**

బీసీ రాజ్యాధికార యాత్ర నందిగామ మండలానికి చేరుకున్న సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ నందిగామ మండల నాయకులు, కార్యకర్తలు తీన్మార్ మల్లన్నకు ఘన స్వాగతం పలికారు. పూలదండలు వేసి, నినాదాలతో యాత్రకు స్వాగతం తెలిపారు.

ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ బీసీల హక్కులు, ఆత్మగౌరవం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం సాగుతున్న పోరాటంలో మల్లన్నకు అండగా ఉంటామని తెలిపారు. బీసీ రాజ్యాధికార యాత్ర లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

**నందిగామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన మల్లన్న**

యాత్రలో భాగంగా నందిగామలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తీన్మార్ మల్లన్న సందర్శించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఏ ఎన్ ఎం లతో మాట్లాడి వారి ఉద్యోగ సమస్యలు, సర్వీస్ పరిస్థితులు, ఉద్యోగ భద్రత తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.

మల్లన్నను చూసిన ఓ ఏ ఎన్ ఎం భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. సుమారు 23 ఏళ్లుగా సర్వీస్ చేస్తున్నప్పటికీ తమను పర్మనెంట్ చేయలేదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతైనా తమ పరిస్థితి మారుతుందని ఆశించినా ఫలితం లేకపోయిందని ఆమె మల్లన్నకు వివరించారు.

రెగ్యులరైజేషన్ కోసం అనేకసార్లు దీక్షలు, ధర్నాలు చేసినప్పటికీ ప్రభుత్వాల నుంచి సరైన స్పందన రాలేదని ఏ ఎన్ ఎం లు తమ ఆవేదనను మల్లన్న దృష్టికి తీసుకువచ్చారు.

**ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడిన మల్లన్న**

ఏ ఎన్ ఎం ల సమస్యలను విన్న మల్లన్న అక్కడి నుంచే సంబంధిత ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.ఏ ఎన్ ఎం ల సమస్యలను సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.అలాగే టి ఎస్ ఈ సి ఏ ఎన్ ఎం చేపడుతున్న దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాంట్రాక్ట్ ల సమస్యల పరిష్కారం కోసం వారి తరపున సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, ఏళ్ల తరబడి సేవలందిస్తున్న ఉద్యోగులకు న్యాయం జరగాలని మల్లన్న పేర్కొన్నారు.

**యాత్రకు పెరుగుతున్న ప్రజల మద్దతు**

నందిగామ నుంచి షాద్‌నగర్ వైపు యాత్ర కొనసాగుతున్న సమయంలో మార్గమధ్యంలో ప్రజలు పూలదండలతో మల్లన్నకు ఘన స్వాగతం పలికారు. అభిమానులు కేరింతలు, జేజేలతో స్వాగతం పలుకుతూ మల్లన్నతో సెల్ఫీలు దిగారు. పలువురు ఆయనను ఆలింగనం చేసుకుని తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా పార్టీ మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క మల్లన్నకు వీరతిలకం దిద్ది స్వాగతం పలికారు. వి ఆర్ ఏ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు మల్లన్నను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మార్గమధ్యంలో ఆర్టీసీ డ్రైవర్లను కలిసిన మల్లన్న వారితో మాట్లాడి వారి యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అనుబంధ బహుజన వర్కర్స్ యూనియన్ ను ఎన్నికల్లో గెలిపించాలని ఈ సందర్భంగా వారిని కోరారు

**షాద్‌నగర్‌లో ఒగ్గు డప్పులతో ఘన స్వాగతం**

బీసీ రాజ్యాధికార యాత్ర షాద్‌నగర్‌కు చేరుకోగానే స్థానిక మహిళలు మంగళహారతులతో ఆహ్వానించి, వీరతిలకం దిద్దారు. పెద్ద సంఖ్యలో మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఒగ్గు డప్పులు, నినాదాల మధ్య మల్లన్నకు స్వాగతం పలికారు. ముదిరాజ్ మహాసభ నాయకులు కూడా మల్లన్నకు స్వాగతం పలికి సత్కరించారు.

**బీసీ మహనీయుల విగ్రహాలకు మల్లన్న నివాళి**

అనంతరం షాద్‌నగర్ ప్రధాన కూడలిలో ఉన్న బీసీ, సామాజిక ఉద్యమ మహనీయుల విగ్రహాలకు తీన్మార్ మల్లన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహాత్మా జ్యోతిబా పూలే దంపతులు, ప్రొఫెసర్ జయశంకర్ సార్, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, పండుగ సాయన్న, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, చాకలి ఐలమ్మ, ప్రజా యుద్ధనౌక గద్దర్ విగ్రహాలకు పూలమాలలు వేసి వారి సేవలను స్మరించుకున్నారు.అనంతరం తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండా గద్దెను మల్లన్న ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముదిరాజ్ మహాసభ నాయకులు, మహిళలు, స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**షాద్‌నగర్ ఎస్టీ హాస్టల్‌ను పరిశీలించిన మల్లన్న**

యాత్రలో భాగంగా షాద్‌నగర్‌లోని ఎస్టీ బాలుర హాస్టల్‌ను తీన్మార్ మల్లన్న ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్‌లోని వసతులను పరిశీలించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు.

వాష్‌రూమ్‌లు సరిగా లేవని, వంటగది పరిస్థితి బాగోలేదని, పడుకోవడానికి అవసరమైన బెడ్లు, బ్లాంకెట్లు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో లేవని విద్యార్థులు ఆయనకు వివరించారు. నేలపై రేకులపై బ్లాంకెట్లు వేసుకుని పడుకోవాల్సి వస్తోందని తమ ఇబ్బందులను తెలియజేశారు. విద్యార్థుల నుంచి సమస్యలు తెలుసుకున్న మల్లన్న ప్రభుత్వ హాస్టళ్లలో కనీస వసతులు ఎందుకు కల్పించడం లేదని అధికారులను ప్రశ్నించారు.

**అధికారులకు ఫోన్.. తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్**

హాస్టల్ పరిస్థితిపై అక్కడి నుంచే సంబంధిత అధికారులను సంప్రదించేందుకు మల్లన్న ప్రయత్నించారు. వార్డెన్ అందుబాటులోకి రాకపోవడంతో మండల డిప్యూటీ తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యం ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, వాష్‌రూమ్‌లు, వంటగది, బెడ్లు, బ్లాంకెట్లు సహా విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.విద్య, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలకు ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలని, వెనుకబడిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందని మల్లన్న పేర్కొన్నారు.

**షాద్‌నగర్ కార్నర్ మీటింగ్**

అనంతరం షాద్‌నగర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో తీన్మార్ మల్లన్న ప్రసంగించారు. బీసీల రాజకీయ ప్రాతినిధ్యం, ముదిరాజ్ సమాజానికి సంబంధించిన వర్గీకరణ అంశం, భూముల పంపిణీ తదితర అంశాలపై పార్టీ వైఖరిని వివరించారు.ముదిరాజ్ సమాజాన్ని ఉద్దేశించి మల్లన్న మాట్లాడుతూ, ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలనే డిమాండ్‌కు మద్దతుగా పోరాడతానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న బీసీ-డీ వర్గీకరణకు బదులుగా బీసీ-ఏలో చేర్చి తగిన హక్కులు అందేలా కృషి చేస్తానని చెప్పారు.

రెడ్డి, వెలమ సామాజిక వర్గాలకు చెందిన వారి వద్ద కోటి ఎకరాల భూములు కేంద్రీకృతమై ఉన్నాయని తమ పార్టీ అధికారంలోకి వస్తే పేదల నుంచి అన్యాయంగా ఆక్రమించుకున్న ఆ భూములను తిరిగి పేదలకు పంచి పెడతామన్నారు.రాజకీయ అధికారంలో బీసీలకు తగిన ప్రాతినిధ్యం రావాలనే లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ పనిచేస్తోందని చెప్పారు.ప్రజలు తమ పార్టీకి సహకరించాలని, బీసీల రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలంటే సంఘటితంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.షాద్‌నగర్‌లో కార్నర్ మీటింగ్ అనంతరం యాత్ర ఎలికట్టే మీదుగా మొగిలిగిద్దకు చేరుకుంది. దీంతో బీసీ రాజ్యాధికార యాత్ర నాలుగో రోజు కార్యక్రమాలు ముగిశాయి.

**ఐదో రోజు యాత్ర ఇలా...**

బీసీ రాజ్యాధికార యాత్ర ఐదో రోజు మొగిలిగిద్ద నుంచి ప్రారంభం కానుంది. అక్కడి నుంచి రామచంద్రపురం మీదుగా కొండూర్గ్ చేరుకుని కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నారు. అనంతరం యాత్ర లాల్‌పహాడ్ చేరుకోనుండగా, అక్కడే రాత్రి బస చేయనున్నారు.

# నేడు తట్టేపల్లి సొసైటీ చైర్మన్‌గా పి.మహిపాల్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



సికే న్యూస్ పెద్దేముల్ ప్రతినిధి, సెప్టెంబర్ 20:వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలం తట్టేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన పి.మహిపాల్‌రెడ్డి నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు.ఈ సందర్భంగా సోమవారం ఉదయం 10.30 గంటలకు తట్టేపల్లి పీఏసీఎస్ కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.నూతన చైర్మన్‌గా పినెముల మహిపాల్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో పీఏసీఎస్ సభ్యులు,రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధికి నూతన చైర్మన్ పి.మహిపాల్ రెడ్డి కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమానికి సంబంధించి ఇప్పటికే అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేసి నిర్వాహకులు ప్రమాణ స్వీకారానికి సర్వం సిద్ధం చేశారు.

## పందిళ్లపల్లి రేక్ పాయింట్ కి 2646మెట్రిక్ టన్నుల యూరియ.

యూరియ ని జిల్లాలకు పంపిణీ చేసిన డిఏఓ పుల్లయ్య.



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని మండల పరిధిలోని పందిళ్లపల్లి రైల్వే రేక్ పాయింట్ కి 2646 మెట్రిక్ టన్నులు యూరియ అదివారం వచ్చింది అని ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు.ఇట్టి యూరియాను జిల్లాలకు పంపిణీ చేశారు.ఖమ్మం జిల్లాకి 1846మెట్రిక్ టన్నులు,భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 400 మెట్రిక్ టన్నులు,మహబూబాద్ జిల్లాకు 300 మెట్రిక్ టన్నులు,ఖమ్మం సీఆర్పీ కి 100 మెట్రిక్ టన్నులు కేటాయించడం జరిగింది అని డిఏఓ పుల్లయ్య తెలిపారు.యూరియ అని లారీల ద్వారా ఆయా జిల్లాల లోని సహకార సంఘాలకు పంపిణీ చేశారు.